# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 247 VEKUVA SAMAYAM TELUGU DAILY తేది: గురువారం 15 అక్టోబర్ 2026

* Mahabubnagar * Hyderabad * Rangareddy & Miryalaguda సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 12


## పోలీసుల దాడుల్లో ఓ విద్యార్థిని వినికిడి శక్తి కోల్పోయింది..



న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ.. నిన్న(మంగళవారం)శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థుల పట్ల ఢిల్లీ పోలీసులు క్రూరంగా వ్యవహరించారంటూ.. రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ మేరకు విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేస్తున్న కేరళకు చెందిన అధిరా అనే విద్యార్థిని.. పోలీసుల దాడిలో వినికిడి శక్తి కోల్పోయిందంటూ మండిపడ్డారు. ఈ అమ్మాయికి జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని రాహుల్ నిలదీశారు. గత నిరసనల్లో ఒక అబ్బాయి కళ్లు కోల్పోతే.. ఈ సారి ఓ అమ్మాయి వినికిడి శక్తి కోల్పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నిరసనల్లో దాడికి గురైన విద్యార్థులు.. తమపై జరిగిన అన్యాయాలను మీడియాకు వివరించారు. అధిరా మాట్లాడుతూ.. 'నిన్న శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న నన్ను పోలీసు వాహనంలో స్టేషన్‌కు తరలించారు.

2వ పేజీలో...




## ఆస్తుల జప్తు

సమయం ప్రతినిధి: తిరుమల తిరుపతి దేవస్థాన లడ్డూ ప్రసాద తయారీలో కల్తీ నెయ్యి వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేవస్థానానికి కల్తీ నెయ్యిని సరఫరా చేసిన బోలేబాబా, వైష్ణవి డెయిరీ సంస్థలకు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. టీటీడీకి రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైన నేపథ్యంలో భోలే బాబా, శ్రీ వైష్ణవి డెయిరీ, సుకృతి ఫుడ్స్‌కు చెందిన ఆస్తుల అటాచ్ చేసుకున్నట్లు ఈడీ తెలిపింది. ఈ సంస్థలు టెండర్లలో పాల్గొన్న ఫ్రంట్ డెయిరీల ద్వారా టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు గుర్తించామని ఈడీ వెల్లడించింది. నకిలీ కొనుగోళ్లు, అమ్మకాలతో లావాదేవీలను నిజమైనవిగా చూపించినట్లు గుర్తించామని తెలిపింది. బ్యాంకు లావాదేవీల ద్వారా చెల్లింపులు చేసి, హవాలా మార్గంలో నగదు వెనక్కి మళ్లించారని భావిస్తోన్నట్లు అధికారులు తెలిపారు. సంస్థల ప్రమోటర్లు విపిన్ జైన్, కైలాష్ చంద్ర మంగ్లా, వారి కుటుంబ సభ్యుల ఆస్తులపైనా చర్యలు తీసుకుంటున్నట్లు వారు వెల్లడించారు.

## సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోంది: కేటీఆర్



సమయం ప్రతినిధి: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామగుండం సింగరేణి ప్రాంతంలో ఏర్పాటు చేసిన 'సింగరేణి కార్మిక గర్జన' సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఆయనతో పాటు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ ఉన్నారు. సింగరేణిపై తుపాకి పెట్టి.. రైతులకు నీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సాగును నాశనం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిపై నిందలు వేస్తోందన్నారు. కరెంట్ కష్టాలకు బొగ్గు లేకపోవడమే కారణమని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పవర్ ప్లాంట్స్‌కు సింగరేణి బొగ్గు ఇవ్వడం లేదని బద్నాం చేస్తోందని ఆయన ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ప్రభుత్వం సింగరేణికి రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని ఆయన వెల్లడించారు. అందుకే సింగరేణిని ప్రైవేటు పరం చేయడానికే ప్రభుత్వం ఇలాంటి కుట్రలు పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు.'పోరాటాల పురిటిగడ్డ రామగుండం. తెలంగాణ వచ్చిన రోజు రాష్ట్రం చుట్టూ చీకట్లే. అలాంటి నేపథ్యంలో సింగరేణి సాయంతో కేసీఆర్ 24 గంటల విద్యుత్ ఇచ్చారు. కేసీఆర్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారు. కానీ.. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు ఇప్పుడు ఏడుస్తున్నారు. మోసపోతే గోస పడతామని కేసీఆర్ ఆనాడే చెప్పారు. కేసీఆర్ మాటలను ప్రజలు పెడచెవిన పెట్టారు. కరెంట్ కోసం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది' అంటూ కేటీఆర్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.



## దుర్గమ్మ సన్నిధిలో రాష్ట్రపతి..

సమయం ప్రతినిధి: ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, దుర్గగుడి చైర్మన్ బొర్రా గాంధీ తదితరులు ఘనస్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఆలయ మర్యాదల ప్రకారం రాష్ట్రపతికి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య రాష్ట్రపతికి ఆశీర్వచనం అందించారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు రాష్ట్రపతికి వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు శ్రీ కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని రాష్ట్రపతికి అందజేశారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు పూర్తయిన అనంతరం ద్రౌపది ముర్ము ఇంద్రకీలాద్రి నుంచి తన కాన్వాయ్‌లో బయలుదేరారు.



## రెస్టారెంట్‌లో కలకలం

హైదరాబాద్, అక్టోబర్ 14, సమయం ప్రతినిధి: నగరంలోని మాదాపూర్‌లో ది జాయింట్ అల్ మండి రెస్టారెంట్‌లో ఆహార నాణ్యతపై వివాదం చోటుచేసుకుంది. రెస్టారెంట్‌లో మటన్ మండి తింటుండగా ఆహారంలో పంటి అవశేషం కనిపించిందని ఓ కస్టమర్ ఆరోపించారు. దీంతో ఆయన వెంటనే రెస్టారెంట్ యాజమాన్యాన్ని ప్రశ్నించినట్లు తెలిపారు. అయితే.. తన ఫిర్యాదుపై స్పందించాల్సిన యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా బెదిరింపులకు దిగిందని బాధితుడు ఆరోపించారు. ఏం చేసుకుంటావో చేసుకో.. ఎక్కడైనా ఫిర్యాదు చేసుకో అంటూ సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. ఆహారంలో పంటి అవశేషం కనిపించడంపై ఆందోళన వ్యక్తం చేసిన వ్యక్తి.. వినియోగదారులకు అందించే ఆహారం విషయంలో కనీస జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం లేదా అంటూ ప్రశ్నించినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తన ఫిర్యాదుపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నిహారిక స్పందించినట్లు తెలిపారు. అయితే.. సమస్యను పరిష్కరించేందుకు సెటిల్‌మెంట్ చేసుకోవాలని సూచించినట్లు బాధితుడు ఆరోపించారు. ఫిర్యాదు చేసి గంటలు గడుస్తున్నా అధికారులు ఘటనాస్థలికి చేరుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు.. అధికారుల అండదండలు ఉన్నాయంటూ కొందరు ఫోన్ కాల్స్ చేసి తనను బెదిరిస్తున్నారని ఆరోపించారు.ఆహార భద్రతపై ఫిర్యాదు చేసిన వ్యక్తికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటూ.. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం జరిగిందా? ఫిర్యాదు అందిన తర్వాత అధికారులు ఎలా స్పందించారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అయితే, ఈ ఆరోపణలపై రెస్టారెంట్ యాజమాన్యం, సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.

## ఎస్ఐఆర్ తుది ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు మరో అవకాశం

### ఈ నెల 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు



మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): ఎస్ఐఆర్-2026 తుది ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పౌరులకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే అర్హులు ఈ శిబిరాల్లో ఫారం-6 సమర్పించవచ్చని పేర్కొన్నారు. ముసాయిదా ఓటరు జాబితా తయారీ సమయంలో గైర్హాజరు, వలస, మరణం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదైన కారణాలతో తొలగించిన పేర్లలో అర్హులైన వారు ఉంటే, వారు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు. పొరపాటున ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడిన అర్హులు సైతం ఫారం-6 ద్వారా తిరిగి నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ రెండు రోజుల శిబిరాల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారి పేర్లను నవంబర్ 9న ప్రకటించనున్న తుది ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గతంలో ఉన్న ఓటరు జాబితాను, ఇటీవల ప్రచురించిన ముసాయిదా జాబితాతో పోల్చి పరిశీలించి, తొలగించబడిన వారిలో అర్హులను గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు స్థానిక బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో తొలగించిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులను గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రాల్లో నివసిస్తున్న అర్హులను గుర్తించేందుకు కూడా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియను ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

# సంపాదకీయం

## జ్ఞానేశ్ కుమార్.. రోజురోజుకీ భారం!

హనుమంతుడు తొలుత అశోక వనాన్ని ధ్వంసం చేశాడు. తర్వాత కింకరుల్ని హతమార్చాడు. జంబుమాలీ, మంత్రి కుమారులు, సేనాధిపతులూ కుప్పకూలిపోయారు. రావణుడి కుమారుడు అక్షకుమారుడినీ బండకేసి కొట్టి చంపాడు. చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం ప్రయోగించిన తరువాతే హనుమంతుడి ప్రతాపం తగ్గింది. గత రెండు, మూడు నెలలుగా దేశ రాజధానిలో చోటుచేసుకుంటున్న దృశ్యాలు చూస్తుంటే వాల్మీకి రామాయణంలోని సుందరకాండ ఘట్టాలు గుర్తుకు వస్తున్నాయి. జూలై–- ఆగస్టు నెలల్లో ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని కాక్రోచ్ జనతా పార్టీ ఉక్కిరిబిక్కిరి చేసింది. అనేక ఎన్నికల యుద్ధాల్లో ఆరితేరిన ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రిమండలి నుంచి తొలగించడం మోదీకి అనివార్యమయింది. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనకు పూనుకుంటామని సీజేపీ ప్రకటించేసరికి మోదీ సర్కార్ అప్రమత్తమైంది. రెండు రోజుల ముందే సరిహద్దు భద్రతా దళాలు, సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు, పారామిలటరీ దళాలు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ రంగంలోకి దిగాయి. దాదాపు 50వేల మంది భద్రతా సిబ్బందికి తోడుగా ప్రైవేట్ దళాలు కూడా చేరాయని అంచనా. అడుగడుగునా బారికేడ్లు. పోలీసులు లాఠీలు ఝుళిపించారు. రెండు, మూడు రోజుల పాటు న్యూఢిల్లీలో గాలి కూడా పూర్తిగా స్తంభించినట్లు కనపడింది. సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్‌దాస్, అశుతోష్ రంకాలను విమానంలోనే అరెస్టు చేసి వేర్వేరు ప్రదేశాలకు తరలించారు. ఢిల్లీలోనే దాదాపు 10వేల మందిని అరెస్టు చేశారు. అనేకమంది ఆన్‌లైన్ వ్యాఖ్యాతలు, కార్యకర్తల్ని కస్టడీలోకి తీసుకున్నారు. అన్ని మెట్రో స్టేషన్లనూ మూసివేశారు. ఢిల్లీకి వచ్చే రైళ్లను రద్దు చేశారు. ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. అయినప్పటికీ కన్నాట్ పస్‌లోనూ, జంతర్ మంతర్ వద్దకు చొచ్చుకువచ్చిన యువతీ యువకులనూ నిర్బంధించారు. మీడియానూ వదలలేదు. బస్సుల నుంచి తప్పించుకు పోకుండా, వాటిలోనే ఇనుప చువ్వలతో లాకప్‌లను నిర్మించారు. దేశ రాజధానిలో యువతరంగం ఉవ్వెత్తున ఎగిస్తే ఏమి జరుగుతుందో అని ప్రభుత్వం భయపడినట్టు ఈ చర్యలతో స్పష్టమయింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో కూడా సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ కింద బ్యానర్లు కట్టారు. సుప్రీంకోర్టు ముందున్న లాయర్ల చాంబర్లలోకి ప్రవేశించి న్యాయవాదులను కూడా అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు నుంచి మండీహౌస్‌కు ఊరేగింపుగా వెళుతున్న న్యాయవాదులను అరెస్టు చేసి, యమునా కాంప్లెక్స్‌కు తరలించారు. సీనియర్ న్యాయవాది దినేశ్ ద్వివేది వారిలో ఒకరు. ఎన్నికల కమిషన్ తరఫున వాదిస్తున్న రాకేశ్ ద్వివేదీకి ఆయన స్వయానా సోదరుడు. 'అసలు సుప్రీంకోర్టులోనూ, సుప్రీంకోర్టు ముందు నిషేధాజ్ఞలు విధించేందుకు మీ అనుమతి తీసుకున్నారా?' అని సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణ్ అడిగిన ప్రశ్నకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు. తనకూ ఈ నిషేధాజ్ఞల గురించి తెలియదని ప్రభుత్వ ప్రధాన న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. న్యాయవాదుల అరెస్టును సుప్రీంకోర్టు, హైకోర్టు బార్ అసోసియేషన్లూ, అడ్వకేట్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ ఖండించాయి. చివరకు భారత ప్రధాన న్యాయమూర్తి జోక్యంతో న్యాయవాదులను విడుదల చేశారు. జమ్మూ–కశ్మీర్‌లో ఇంటర్నెట్, టెలికమ్యూనికేషన్ సదుపాయాలను నిలిపి వేయడం రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని అనురాధా బాసిన్ కేసులో జస్టిస్ రమణ బెంచ్ 2020లో ఇచ్చిన తీర్పును పలువురు న్యాయవాదులు ఉటంకించడంతో ఢిల్లీలో నిషేధాజ్ఞలు ఎత్తివేయాలని కేంద్రానికి సీజేఐ సూర్యకాంత్ చెప్పాల్సి వచ్చింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాపై ప్రారంభించిన ఉద్యమం వేడి సుప్రీంకోర్టుకు తగిలినట్లే కనపడుతోంది. ఎందుకంటే ఈ విషయంలో సరైన సమయంలో జోక్యం చేసుకోలేని నిస్సహాయతే సుప్రీంకోర్టును ఆత్మరక్షణలో పడేలా చేసింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 12న ఇండియా కూటమి సుప్రీంకోర్టు వరకు నిరసన ఊరేగింపును నిర్వహించింది. ప్రభుత్వం దాదాపు ప్రేక్షక పాత్ర వహించింది. కాంగ్రెస్ చెబుతున్న ప్రకారం... నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ దాదాపు రెండున్నర లక్షల మంది నాలుగు గంటల పాటు న్యూఢిల్లీలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల కార్యకర్తలే కాకుండా, కాక్రోచ్ పార్టీ పిలుపునకు ప్రతిస్పందించిన విద్యార్థులు, యువజనులు, పౌర సమాజ సభ్యులూ పాల్గొనడంతో కన్నాట్ ప్లేస్ పరిసర ప్రాంతాలు జన సమ్మర్దంతో కిక్కిరిసిపోయాయి. మొట్టమొదటిసారి కాంగ్రెస్ పార్టీ తన బలం యావత్తునూ పూర్తిగా కేంద్రీకరించడంతో వివిధ రాష్ట్రాల నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వేల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీకి రాకపోతే అధిష్ఠానం ఆగ్రహానికి గురికావల్సి వస్తుందన్న భయం మొదటిసారి కాంగ్రెస్ నేతల్లో కనపడింది. సుప్రీంకోర్టుకు ఊరేగింపు ఒక నెపం మాత్రమేనని, మొత్తం పార్టీలో ఉద్యమ స్ఫూర్తిని, వీధి పోరాట తత్వాన్ని రగల్చడమే రాహుల్‌గాంధీ వ్యూహం అన్న విషయం విదితమయింది. పదవులు ఆశిస్తూ, పైరవీలే ధ్యేయంగా జీవిస్తున్న కాంగ్రెస్ నేతలు మొట్టమొదటిసారి చెమటోడ్చారు. పోలీసులతో రాహుల్, ప్రియాంక వాదిస్తూ, వారిని ప్రతిఘటిస్తూ, బారికేడ్లను దాటుతూ ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ కార్యకర్తల్లో కదలిక రాకుండా ఎలా ఉంటుంది? ఒక రకంగా ఇది కాంగ్రెస్ నరనరాల్లో చైతన్యాన్ని రగిల్చిన క్షణం. ఈ నిప్పురవ్వను మరింతగా మండించేందుకే రాహుల్, ప్రియాంక సిద్ధపడుతున్నట్లు కనపడింది. మొదట ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు, ఆ తరువాత సుప్రీంకోర్టు దాకా నిర్వహించారు. ఇక రాష్ట్రాల్లో ప్రకటించిన కార్యాచరణను కాంగ్రెస్ ఎంత ఉద్యమస్ఫూర్తితో నిర్వహిస్తుందో వేచి చూడాలి. ఓట్ చోరీపై ప్రారంభించిన ఈ ఉద్యమం ఓటర్లలో తమ ఓటు హక్కు గురించి చైతన్యాన్ని కల్పించే దిశలో ఊపందుకుంటే కానీ ఆశించిన ఫలితాలు రావు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష

### అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు కావాలి - నాయకులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం



రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటరు నమోదు ప్రక్రియపై షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల వారీగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఓటరు నమోదు విషయంలో ప్రతి నాయకుడు బాధ్యత తీసుకొని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి ,రాయికల్ శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, సింగిల్ విండో చైర్మన్ అంబటి ప్రభాకర్, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, జితేందర్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు బాబు నాయక్, శివరెడ్డి, కౌన్సిలర్ రాజు నాయక్, సి. పెంటయ్య, శ్రీను నాయక్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ చైర్మన్ జాంగారి రవి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్ ,నేతలు జంగయ్య, నీరటి వాసు తదితరులు పాల్గొన్నారు.

## వెట్టిచాకిరి నిర్మూలనకు పారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలి

### ఇటుక బట్టీలు, మార్కెట్ యార్డుల్లో అక్రమాలను గుర్తించి న్యాయ సేవాధికార సంస్థకు సమాచారం అందించాలి: స్వాతి మురారి




మహబూబాబాద్ జిల్లా: అక్టోబర్ 14 (వేకువ సమయం): వెట్టిచాకిరి వ్యవస్థను గుర్తించి నిర్మూలించడంలో పారా లీగల్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి పిలుపునిచ్చారు. జిల్లాలోని ఇటుక బట్టీలు, మార్కెట్ యార్డులు తదితర ప్రాంతాల్లో వెట్టిచాకిరి జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే న్యాయ సేవాధికార సంస్థకు సమాచారం అందించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన వెట్టిచాకిరి నిర్మూలన పథకాన్ని మహబూబాబాద్ జిల్లాలో అమలు చేసేందుకు బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. వెట్టిచాకిరి నిర్మూలన పథకం ఉద్దేశాలను వివరించారు. కొన్ని నెలల క్రితం నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లోని ఇటుక బట్టీలలో వెట్టిచాకిరి వ్యవస్థను గుర్తించిన నేపథ్యంలో పారా లీగల్ వాలంటీర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే పారా లీగల్ వాలంటీర్లు వెట్టిచాకిరి, బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ, బాధితులకు న్యాయ సేవాధికార సంస్థకు మధ్య వారధిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో ప్యానెల్ న్యాయవాదులు, మహబూబాబాద్ జిల్లాకు చెందిన పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## రైల్వే బ్రిడ్జికై తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరాహార దీక్ష

### రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుంటే ఖబర్దార్-TRP ఇంచార్జి ఎమ్మె సంతోష్

షాద్ నగర్: షాద్ నగర్ మున్సిపాలిటీ లో చటన్ పల్లి రైల్వే గేట్ వద్ద చటన్ పల్లి రైల్వే గేట్ నిర్మాణం పూర్తి చేయాలని రాజ్యాధికార పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ఉప్పరమోని రాములు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్ గారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. షాద్ నగర్ మున్సిపల్ లోని చటన్ పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణం వీలైనంత త్వరగా పనులను ప్రారంభించాలని దానివల్ల నిత్యం రాకపోకలు సాగిస్తూ సుమారు 20 గ్రామాల ప్రజలు మరియు హైదరాబాదు తదితరుల పరిసర ప్రాంతాల నుండి ప్రజలు షాద్నగర్ టౌన్ కి రాకపోకలు సాగిస్తుంటారు కనుక సుమారు 150 కి పైగా ట్రైన్లు నిత్యం రాకపోకలను జరుగుతుంటాయి కనుక 15 20 నిమిషాలకు ఒకసారి రైల్వేగేటు వేయడం వల్ల ప్రజలకు ఎండలో వానలో 15 20 నిమిషాలకు కుటుంబ చిన్నపిల్లలతో బైకుల పైన వెయిటింగ్ చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది అనేక ఇబ్బందులకు గురవుతారు వైద్యం నిమిత్తం అంబులెన్సులు రైల్వే గేట్ పడితే ప్రమాదం బారిన పడినటువంటి రోగుల ప్రాణాలు గాలిలో కలుస్తాయి. గతంలో ప్రమాదాల బారిన పడినవారు ప్రాణాలను కోల్పోయారు మరియు గర్భిణీలు కాన్పులు అయినా పరిస్థితి కావున ఇప్పటికైనా వీలైనంత త్వరగా రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజల కష్టాలను తీర్చాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే గారిని డిమాండ్ చేయడమైనది లేనియెడల రానున్న రోజుల్లో ఈ ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు ఇట్టీ కార్యక్రమానికి చటాన్ పల్లి, రాంనగర్ చుట్టుపక్కల గ్రామంలో ప్రజలు బీసీ సంఘం నాయకులు మరియు తదితరులు మద్దతు ఇవ్వడమైనది. నిరాహార దీక్ష విరమణ అనంతరం RDO కార్యాలయం లో వినతి పత్రం అందజేయడంమైనది. ఈ కార్యక్రమం లో షాద్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్, తాలూకా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్ ముదిరాజ్, షాద్ నగర్ మునిసిపల్ అధ్యక్షులు ఉప్పరమోని రాములు, జిల్లా నాయకులు గుళ్ళు శ్రీనివాస్, ఫరూక్ నగర్ మండల అధ్యక్షులు ఆవ జగన్, కొందుర్గు మండల దర్గ వెంకటేష్, చౌదరిగూడ మండల అధ్యక్షులు డి రాములు, చేవెళ్ల మండల అధ్యక్షులు అశోక్, , గోపాల్, హరిప్రసాద్, గుండ్ల నవీన్, గుంటి శంకర్, జోసెఫ్, రవి కుమార్, యాదయ్య, వడ్డే శంకర్, గడీల అంజయ్య, శ్రీశైలం, ఎల్ల రాజు, యాదగిరి లు పాల్గొన్నారు.

## పోలీసుల దాడుల్లో ఓ విద్యార్థిని వినికిడి శక్తి కోల్పోయింది..

మొదటి పేజీ తరువాయి

అమ్మాయిలను అరెస్ట్ చేసిన సందర్భంలో ఓ లేడీ కానిస్టేబుల్ వెంట ఉండాలి కదా.. అని ప్రశ్నించాను. దీనిపై కోప్పడ్డ పోలీసులు.. ఆపకుండా చెంపదెబ్బలు కొట్టారు. ఈ దాడిలో నా కంటికి, చెవికి తీవ్రగాయాలయ్యాయి. ఒక చెవి వినికిడి శక్తిని కోల్పోయింది' అని ఆవేదన చెందారు. మరో నిరసనకారుడు మాట్లాడుతూ.. 'నన్ను, నా సహోద్యోగిని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి.. 15-20 మంది పోలీసులు అతి దారుణంగా కొట్టారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఢిల్లీ సరిహద్దులకు మమ్మల్ని తరలిస్తున్న సమయంలో.. అంకిత్ కసానా అనే కానిస్టేబుల్ దారిపొడవునా కొడుతూనే ఉన్నాడు' అని తెలిపారు. వాంతులు వస్తున్నాయని పోలీసులను అభ్యర్థించగా.. 'బ్యాగ్‌లో వాంతి చేసుకో' అంటూ నిర్లక్ష్యంగా బదులిచ్చారని ఓ విద్యార్థి వాపోయారు. పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో తమను అమానుషంగా కొట్టారని, ప్రైవేట్ పార్ట్స్‌పై దాడి చేశారని ఓ విద్యార్థి తెలిపారు. ఫోన్లు, వాలెట్లను లాక్కొని.. తిరిగి ఇవ్వకుండానే తమను విడుదల చేశారని మరికొందరు ఆరోపిస్తున్నారు.

**దాడులను రికార్డు చేయండి: రాహుల్ గాంధీ**

'పోలీసుల దాడులను ఫోన్‌లో రికార్డ్ తీయండి. దాడులకు సంబంధించి సాక్ష్యాధారాలు ఉంటే.. న్యాయపరమైన పోరాటం చేసే అవకాశం ఉంటుంది. మన దగ్గర సాక్ష్యాలు ఉంటే.. కానిస్టేబుల్ నుంచి అమిత్ షా, మోదీ వరకు ఎవరినైనా అరెస్ట్ చేయవచ్చు'అని రాహుల్ పేర్కొన్నారు. కాగా.. పోలీసుల దాడులపై మల్లిఖార్జున ఖర్గే స్పందించారు. 'ముందుగా శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేశారు. ఆపై.. జంతర్ మంతర్‌పై నిషేధం విధించడం ద్వారా నిరసన చేసే హక్కునే కాలరాశారు. ఇప్పటికైనా జ్ఞానేష్ కుమార్‌ను కాపాడడం మానుకోండి' అంటూ హితవు పలికారు.

# పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని బాహుబలి మోటార్లు ప్రారంభించిన మంత్రి జూపల్లి





- ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం
- చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది,
- రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు?

**సమయం (ప్రతినిధి నాగర్‌కర్నూల్) అక్టోబర్ 14:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే.. దీన్ని జాతికి అకింతం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టును గత పాలకులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. మహాత్మాగాంధీ- కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిలాసాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని తెలిపారు. ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన గత పాలకులు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు వివరించాలని నిలదీశారు. రైతాంగానికి సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుతం ప్రాజెక్టుల పురోగతిపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం మేరకు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల వారీగా సమస్యలను గుర్తించి, పనుల పురోగతిని సమీక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యమని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే స్వయంగా దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి



- ఎమ్మెల్యే స్వయంగా నిందితులను చట్టానికి అప్పజెప్పాలి.
- అగ్రవర్ణాల అరాచకాలపై దద్దరిల్లిన దండోరా మోత.
- అండగా నిలిచిన బహుజన సమాజం.
- వెంకట్రాం రెడ్డితో సహా నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డి.ఎస్. పి గారికి వినతి.
- తక్షణమే అరెస్టు చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం.

వనపర్తి : పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో దళిత బిడ్డ మాసాని. సుధీర్ పై అగ్రవర్ణాల దాడిని ఎం.ఆర్. పి.ఎస్, బి.సి.కులాల ఐక్యవేదిక,దళిత శక్తి పార్టీ,దళిత సంఘాల ఐక్యవేదిక,కళాకారుల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించాయి. మొదట డి.ఎస్.పి కి వినతి పత్రం అందజేసి నిందితులు వెంకట్ రామ్ రెడ్డి. ఎద్దుల.శ్రీనివాస్ రెడ్డినీ వెంటనే అరెస్టు చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడుతామని ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తూ నాయకులు మల్లెపోగు.శ్రీనివాస్ మాదిగ, చెన్నకేశవులు మాదిగ,రాములు యాదవ్,రామకృష్ణ,కురుమయ్య,చెన్నయ్య,డప్పు స్వామి మాట్లాడుతూ.....ఎమ్మెల్యే సొంత గ్రామంలో దళితులకు జరిగిన అవమానం యావత్తు దళిత జాతికి జరిగిన అవమానం అని ఎమ్మెల్యే స్వయంగా దళితులకు క్షమాపణ చెప్పి తన మేనమామ వెంకట్రామ్ రెడ్డిని మిగతా నిందితులను స్వయంగా చట్టానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎమ్మెల్యే సొంత గ్రామంలో కాపాడుకోలేని వ్యక్తి దళితులకు న్యాయం చేస్తాడని నమ్మకం లేదని ఆరోపించారు. మొన్న సంఘటన జరిగితే నేటికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని వెంటనే కేసు నమోదు చేసి నిందితులని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే,కలెక్టర్,ఎస్పీ స్వయంగా గ్రామాన్ని సందర్శించి దళితులకు ఆత్మస్థైర్యం కల్పించి వారితో కలసి సహపంక్తి భోజనం చేసి దళితుల ఆత్మగౌరవం నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొడ్ల.రాములు,పానుగంటి. విజయ్,గంధం.పరంజ్యోతి, సురేష్,రవి,నాగరాజు, అజయ్, సూర్యప్రకాష్,భీమయ్య,సత్యం,బాధితుడు సుధీర్ ఉన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో- ఇందిరమ్మ ఇళ్ల జాతర...!

**తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ శ్రీ వాకిటి శ్రీహరి అన్నగారి ఆదేశాల మేరకు...**

మక్తల్ : మక్తల్ నియోజకవర్గం :నర్వ మండలంలోని ఉందేకోడు, జంగం రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు నూతన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం హర్షణీయం. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను నిజం చేయాలనే ప్రజా ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. గౌరవ ఎంపీడీవో శ్రీనివాస్ గారు, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ గారు తమ చేతుల మీదుగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు.



12 కుటుంబాల్లో కొత్త ఆశలు...
పేదల కళ్లలో ఆనందం...
సొంతింటి కల సాకారం దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మరో అడుగు.!
పేదల సంక్షేమమే లక్ష్యంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కి, అలాగే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు అందించిన నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.
??ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వినయ్ కుమార్ , ఎంపీవో రాఘవేందర్ , ఏఎంసీ వైస్ చైర్మన్ డి. కృష్ణ రెడ్డి , శ్రీపురం గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గారు, మండల ఉపాధ్యక్షులు శరణప్ప , మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బద్దిపల్లి రాజారెడ్డి , మండల ప్రచార కార్యదర్శి బీసం రవికుమార్ , జనార్దన్ రెడ్డి గారు, బీసం రామకృష్ణ , నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి. అశోక్ గౌడ్ , నర్వ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్దల ఆంజనేయ రెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉందేకోడు, జంగం రెడ్డిపల్లి గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె



గద్వాల: ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో నిరవధిక సమ్మె ప్రారంభించారు. 78 కేడర్ల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వేతనాలు, ఇంక్రిమెంట్లు, బకాయిల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కొల్లాపూర్ నుంచి అమరచింతకు నడిచే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి




అమరచింత : కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కొల్లాపూర్ వయా పెబ్బేర్ కొత్తకోట ఆత్మకూరు అమరచింత మీదుగా మరికల్ నారాయణ పేట వరకు క్రమం తప్పకుండా గతంలో బస్సును ఆర్టీసీ అధికారులు రద్దు చేశారని తిరిగి బస్సును పునరుద్ధరించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి కుతుబ్ డిమాండ్ చేశారు. కొల్లాపూర్ అమరచింత బస్సును పునరుద్ధరించాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల నేతలు బుధవారం కొల్లాపూర్ డిపో మేనేజర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.డి. కుతుబ్ మాట్లాడుతూ కొల్లాపూర్ బస్సు గత కొంతకాలంగా రద్దు కావడం చేత ప్రజలు, విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం అమలు కావడం చేత బస్సుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిందని ఇలాంటి తరుణంలో కొత్త బస్సులను ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం ఏళ్లుగా నడుస్తున్న ఆర్టీసీ బస్సులను రద్దు చేయడం సబబు కాదని అన్నారు. కొల్లాపూర్ నుంచి వచ్చే బస్సు స్కూళ్లకు కాలేజీలకు ఉద్యోగులకు సరైన సమయంలో అందరికి సౌలభ్యకరంగా తిరిగేదని అన్నారు. కావున రద్దుచేసిన బస్సును తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ సిపిఐ మండల కార్యదర్శి శివ, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీను గోవర్ధన్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వేకువ సమయం
గురువారం 15 అక్టోబర్ 2026





# పండుగల సాయన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగల సాయన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. నవాబ్ పేట మండల కేంద్రంలో పండుగల సాయన్న విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ. ...పండుగల సాయన్న ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితమైన నాయకుడు కాదని, సమాజంలోని పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని పేర్కొన్నారు. పేదల ఆకలి బాధలను అర్థం చేసుకొని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే పండుగల సాయన్న గొప్పతనమని తెలిపారు. ఎవరి కులం ఏమిటి, ఏ వర్గానికి చెందినవారు అనే తేడాలు చూడకుండా, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయం చేసిన మహనీయుడని కొనియాడారు. పండుగల సాయన్న వంటి ప్రజానాయకులను ఒక కులానికే పరిమితం చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధులు కూడా సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. వీరందరి జీవితాలు సమాజంలోని అణగారిన వర్గాలకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి, జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడంతోనే మన బాధ్యత పూర్తికాదని మంత్రి అన్నారు. వారు చూపిన మార్గంలో నడుస్తూ, వారి ధైర్యాన్ని, సేవా భావాన్ని, సమానత్వ స్ఫూర్తిని మన జీవితాల్లో ఆచరించినప్పుడే విగ్రహాల ఏర్పాటుకు నిజమైన అర్థం ఉంటుందని పేర్కొన్నారు. నిజాం పాలనలో పేదల పక్షాన నిలబడి, అన్యాయాన్ని ఎదిరించిన పండుగల సాయన్న స్ఫూర్తిని యువత అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండాలని, పేదలు, నిరుపేదలు, అణగారిన వర్గాలకు అండగా నిలవాలని సూచించారు. మనిషి జీవితంలో సమాజానికి ఎంత మేలు చేశామన్నదే ముఖ్యమని, మనం జీవించినంత కాలం ఇతరులకు ఉపయోగపడేలా పనిచేయాలని హితవు పలికారు. పండుగల సాయన్నకు



నివాళులర్పించడమంటే ఆయన చూపిన మార్గంలో నడుస్తూ పేదల సంక్షేమం కోసం కృషి చేయడమేనని స్పష్టం చేశారు. పండుగల సాయన్నకు ప్రభుత్వ గుర్తింపు చారిత్రాత్మకంతెలంగాణలో పండుగల సాయన్నకు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమైన విషయమని మంత్రి పేర్కొన్నారు. పండుగల సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలనే ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయమన్నారు. ఈ అంశంపై తాను సమర్పించిన విజ్ఞప్తికి ప్రభుత్వం త్వరితగతిన స్పందించి నిర్ణయం తీసుకోవడం పండుగల సాయన్నకు దక్కిన గౌరవమని తెలిపారు. ఈ గుర్తింపు ముదిరాజ్ సమాజానికే కాకుండా, పండుగల సాయన్నను అభిమానించే ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు. పండుగల సాయన్న గొప్పతనాన్ని తెలంగాణ సమాజం మొత్తం గుర్తించి, ఆయన సేవలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. తెలంగాణ కులగణన సామాజిక న్యాయం దిశగా కీలక అడుగుదేశంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనకు కులగణన ఎంతో ముఖ్యమని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణలో కులగణన చేపట్టడం ద్వారా వివిధ సామాజిక వర్గాల జనాభా, వారి సామాజిక పరిస్థితులపై స్పష్టత తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించిందని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే వారి వాస్తవ పరిస్థితులను గుర్తించడం అవసరమని, ఆ దిశగా కులగణన కీలకమైన అడుగని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాల్లో తగిన అవకాశాలు లభించేలా కృషి చేయాలని అన్నారు.

**ముదిరాజ్ సమాజానికి న్యాయం జరిగేలా బీసీ-డీ వర్గీకరణ కోసం కృషి చేస్తాం**

ముదిరాజ్ సమాజానికి న్యాయం జరిగేలా, వారి చిరకాల ఆకాంక్ష అయిన బీసీ-డీ వర్గీకరణ అంశంపై కృషి చేస్తామని మంత్రి తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ముదిరాజ్ సమాజానికి న్యాయం జరగడంతో పాటు, ఇప్పటికే బీసీ-డీ వర్గంలో ఉన్న ఇతర కులాల హక్కులు, సంక్షేమ ప్రయోజనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. అవకాశం వచ్చినప్పుడు సమాజానికి మేలు చేసే నిర్ణయాల కోసం పోరాడాలని,

- కులాలకు అతీతంగా పేదల కోసం పోరాడిన గొప్ప ప్రజానాయకుడు పండుగల సాయన్న
- మహనీయుల విగ్రహాలకు దండలు వేయడమే కాదు.. వారి ఆశయాలను ఆచరించాలి
- ముదిరాజ్ సమాజానికి న్యాయం జరిగేలా బీసీ-డీ వర్గీకరణ కోసం కృషి చేస్తాం
- తెలంగాణలో కులగణన సామాజిక న్యాయం దిశగా కీలక అడుగు
- పండుగల సాయన్న విగ్రహావిష్కరణ సభలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

రాజకీయాలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదల సంక్షేమం కోసం పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ముదిరాజ్ సమాజం విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

**ముదిరాజ్ సమాజ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం**

ముదిరాజ్ సమాజంలోని యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం, పేద కుటుంబాలకు అండగా నిలవడం, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి, తమ హక్కుల సాధనతో పాటు ఇతర వర్గాల అభ్యున్నతికి కూడా తోడ్పడాలని కోరారు. కులమతాలకు అతీతంగా మానవత్వానికి ప్రాధాన్యతనిస్తూ సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పండుగల సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన పెద్దలకు, నిర్వాహకులకు, నవాబుపేట మండలంలోని ముదిరాజ్ సంఘాలకు, సహకార సంఘాల ప్రతినిధులకు మంత్రి వాకిటి శ్రీహరి హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. పండుగల సాయన్న చూపిన ధైర్యం, పేదల పట్ల ఆయనకున్న నిబద్ధత, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.

# పడమటిపల్లి సబ్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



దేవరకొండ: అక్టోబర్ 14 (సమయం ప్రతినిధి) : రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండ మండలంలోని పడమటిపల్లి సబ్‌స్టేషన్ వ్యవసాయ విద్యుత్ కోతలకు నిరసనగా రైతులు చేపట్టిన సబ్ స్టేషన్ ముట్టడి కార్యక్రమంలో ఆయన సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందక, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో పంటలు ఎండిపోతున్నాయని, రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పంటలు కీలకమైన పొట్ట దశలో ఉన్న సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తుంటే, వాటిని కాపాడుకునేందుకు అవసరమైన విద్యుత్ అందకపోవడం బాధాకరమన్నారు. గ్రామాల్లో పంట పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన సందర్భాల్లో వాటి స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోందని, దీంతో రైతులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించి, రైతులకు అవసరమైన సమయంలో నాణ్యమైన విద్యుత్ అందించేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్నప్పటికీ, రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సాగునీరు, విద్యుత్ కొరతతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలి అని, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలని, పంట నష్టపోయిన రైతులను గుర్తించి అర్హులకు నష్టపరిహారం అందించాలని రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, స్థానిక సర్పంచ్ పల్లా శ్రీకాంత్ రెడ్డి, సర్పంచులు మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, నాగవరం వెంకటేశ్వర్ రావు, తోటకూర వెంకటయ్య, తిరుపతి నాయక్, సంకూ కొండల్ రెడ్డి, దేప శైలేందర్ రెడ్డి, కొమ్ము రామస్వామి, నూతనకంటి రఘు, పాత్లవత్ దాస్రూ నాయక్, జెల్ల రేణు గౌడ్, సూరి, యాదయ్య, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# పసివాడి వెండి కడియాలు దొంగిలిస్తుండగా పట్టివేత

**దొంగను చెప్పుతో చితకబాదిన మహిళ.. గద్వాల బస్టాండ్‌లో ఘటన**

సమయం ప్రతినిధి: గద్వాల గద్వాల బస్టాండ్‌లో బుధవారం మధ్యాహ్నం పసివాడి కాలికి ఉన్న వెండి కడియాలను దొంగిలించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని కుటుంబ సభ్యురాలు పట్టుకుంది. బస్సు ఎక్కే సమయంలో చిన్నారి కాళ్లకు ఉన్న కడియాల్లో ఒకదాన్ని తీసి, మరో కడియాన్ని తీసేందుకు ప్రయత్నించగా గమనించిన మహిళ అతడిని పట్టుకొని చెప్పుతో కొట్టింది. అప్రమత్తమైన ప్రయాణికుల మధ్య దొంగ పారిపోలేకపోయాడు. మహిళ కడియాన్ని తిరిగి తీసుకుంది. ఈ ఘటనతో బస్టాండ్‌లో కొద్దిసేపు కలకలం నెలకొంది.



# అధికార, ప్రతిపక్షాలకు అతీతంగా అభివృద్ధి.. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు






కీసర సమయం ప్రతినిధి అక్టోబర్ 14: పోచారం: అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా అభివృద్ధి పనుల్లో ఎలాంటి వివక్ష చూపబోమని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదని, అర్హతే ప్రామాణికమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కలిసి ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలో ఉపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించకుండా, వారు నివసించే ప్రాంతాలకు సమీపంలోనే గౌరవప్రదమైన నివాసాలు కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శక బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ టవర్స్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని, అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని స్పష్టం చేశారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందించడమే లక్ష్యమన్నారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లోనూ అర్హుల దరఖాస్తులను పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని తెలిపారు. ఇప్పటికే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.440 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అనంతరం మంత్రులు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, జిల్లా కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మతి పథకంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు.

## నూతన గృహప్రవేశ వేడుకకు హాజరైన ఆల ప్రీతిరెడ్డి



మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర మండలం పెద్దరాజమూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అంజిల్ రెడ్డి నూతన గృహప్రవేశం సందర్భంగా నిర్వహించిన వాస్తుపూజ కార్యక్రమంలో ఆల ప్రీతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజిల్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆమె అభినందించి, నూతన గృహంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రముఖులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే మద్దతు
### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి




మహబూబాబాద్, (సమయం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు కొనసాగింది. సమ్మెకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న ఉద్యోగులను కలిసి వారి సమస్యలను, న్యాయమైన డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఉద్యోగులు కోరారు. నాయకులు మద్దతు ప్రకటించడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమాకర్, వైద్యులు శ్రీకాంత్, రవళి, నర్మద, స్పందన, ప్రేమ్‌చంద్, శివ, స్వామి, మహేష్, నవీన్, వరుణ్, వసుమతి, స్వప్న, కిరణ్మయితో పాటు ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఔషధ విక్రేతలు, రేడియాలజీ, క్షయ వ్యాధి విభాగాల సిబ్బంది, నర్సులు స్వప్నరాణి, స్వర్ణ, మమత, సుజాత, విజేత, మౌనిక, స్రవంతి, ఆరోగ్య కార్యకర్తలు విజయ, వెంకటలక్ష్మి, మంజుల, రజిత, ప్రేమలత, జ్యోతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూలో చేరిన 62 మంది ఓఆర్ఆర్-హెచ్ఎండీఏ కాంట్రాక్ట్ కార్మికులు

**కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి: సీఐటీయూ**



కీసర సమయం ప్రతినిధి, అక్టోబర్ 14: కార్మికుల హక్కుల సాధన, కార్మిక చట్టాల అమలు కోసం నిరంతరం పోరాడుతున్న సీఐటీయూ యూనియన్‌లోకి శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో పనిచేస్తున్న సుమారు 62 మంది హెచ్ఎండీఏ కాంట్రాక్ట్ కార్మికులు చేరారు. ఈ విషయాన్ని సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు వెల్లడించారు. కీసర టోల్‌గేట్ వద్ద నిర్వహించిన హెచ్ఎండీఏ కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల పరిరక్షణ, కార్మిక చట్టాల అమలు కోసం సీఐటీయూ నిరంతరం ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమని పేర్కొన్నారు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే..**

ఓఆర్ఆర్-హెచ్ఎండీఏ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ నెలకు కనీసం రూ.26,000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన కార్మికుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని, అందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. వారాంతపు సెలవులను తప్పనిసరిగా అమలు చేయడంతో పాటు కార్మికులందరికీ తొమ్మిది రకాల భద్రతా పరికరాలతో కూడిన సేఫ్టీ కిట్లు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అర్బన్ ఫారెస్ట్రీ, పార్కులు, ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కాలపరిమితి ముగిసిన పేరుతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులను తొలగించడం లేదా ఇతరులతో భర్తీ చేయడం చేయరాదని, వారందరినీ యథావిధిగా కొనసాగించాలని స్పష్టం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బంగారు నర్సింగరావు కోరారు. బంగారు నర్సింగరావు కార్యదర్శి, సీఐటీయూ కీసర మండల కమిటీ సంప్రదించాల్సిన నంబర్: 8333910434

## పాలమూరు పంపులు ఆపకుండా నడపాలి



వనపర్తి : నార్లాపూర్‌లో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపుల ప్రారంభం సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలను ఒక ప్రకటనలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఖండించారు. సిగ్గు లేదా జీడిగింజా అంటేనల్లగున్న నాకేం సిగ్గు అన్నట్లుంది మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు అంటూ ఎద్దేవ చేశారు. మూడేళ్లుగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పడావు పెట్టింది ఎవరు ?బీఆర్ఎస్ పాలనలోనే పూర్తయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కాలువల టెండర్లను రద్దు చేసింది ఎవరు ?గత మూడేళ్లుగా కాలువలు తవ్వకుండా అడ్డుకున్నది ఎవరు ?పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు సాగకుండా కేసులు వేసింది కాంగ్రెస్ పార్టీ కాదా ?అప్పుడు జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నది నిజం కాదా ? అని ప్రశ్నలు సంధించారు. మూడేళ్ల క్రితమే నార్లాపూర్ లో పంపును కేసీఆర్ ప్రారంభించిన విషయం తెలంగాణ మొత్తానికి తెలుసు కదా గుర్తు చేస్తూమరి ఎల్ నినో వస్తుంది, కరువు తెస్తుంది అని తెలిసినా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులు ప్రారంభించి నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లు నింపాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నా ఎందుకు స్పందించలేదు ? అని ప్రశ్నించారు. నార్లాపూర్, ఏదుల మధ్యన పెండింగ్ పనులు పూర్తి చేయాలని బీఆర్ఎస్ గత మూడేళ్ళుగా డిమాండ్ చేస్తున్న విషయం తెలియదా ?శ్రీశైలంలో నీళ్లు ఉన్నా నార్లాపూర్ పంపులు గత రెండు నెలలుగా ఎందుకు ప్రారంభించలేదు ?ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, రైతుల మీద ప్రేమ ఉంటే రెండు పంపులు నడిపి వట్టెం, కరివెన వరకు సాగునీరు తీసుకువెళ్లొచ్చు అని సూచించారు. పది పంపులు నడపాలి అంటే పెండింగ్ పనులు అడ్డంకిగా ఉంటాయి .. నార్లాపూర్, ఏదులలో రెండు పంపులు నడపడానికి ఎలాంటి ఇబ్బందులు లేవని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులు పూర్తి స్థాయిలో ఎందుకు నడపలేదు ? శ్రీశైలం నీళ్లు ఏపీ ప్రభుత్వం 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పంకు తరలించింది. బీఆర్ఎస్ పార్టీ ముల్లుకర్ర పెట్టి కుచ్చితే కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి రావడం లేదు. బీఆర్ఎస్ పార్టీ హెచ్చరికల నేపథ్యంలోనే కాంగ్రెస్ కళ్లు తెరిచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మోటార్లు ఆన్ చేసింది. ఇప్పటికైనా నార్లపూర్ రిజర్వాయర్ పూర్తిగా నిండే వరకు మోటార్లు నడపాలి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పడావు పెట్టిన పనులు వెంటనే పూర్తి చేయాలి. మూడేళ్లుగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు నిలిపి వేసినందుకు పాలమూరు రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌ని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి



దేవరకొండ: అక్టోబర్ 14:(సమయం ప్రతినిధి) : ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ వచ్చేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు, పార్టీ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు పెంచేందుకు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి శ్రేణులతో కలిసి దేవరకొండ నియోజకవర్గం నుంచి అధిక మెజారిటీ వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని సూచించారు.





గరుడ స్థంభం, గడప రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు

# పడమటి ఆంజనేయ స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణంలో కీలక ఘట్టం







మక్తల్ : పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి ఆలయ నూతన రాజగోపుర నిర్మాణంలో భాగంగా నిర్వహించిన గరుడ స్థంభం, గడప రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి వాకిటి లలిత దంపతులు సంయుక్తంగా కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శాస్త్రోక్తకంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ఆధ్యాత్మిక సంప్రదాయానికి , భక్తి భావానికి ప్రతీకగా నిలిచే పడమటి ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా నూతన రాజగోపుర నిర్మాణం చేపట్టడం, దీనిలో భాగంగా గరుడ స్థంభం, గడప రాయి ప్రతిష్ఠాపనతో ఆలయ నిర్మాణ పనుల్లో పాలు పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు.గరుడ స్థంభం, గడప రాయి ప్రతిష్ఠాపనతో రాజగోపుర నిర్మాణ పనుల్లో మరో కీలక ఘట్టం పూర్తయినట్లు మంత్రి తెలిపారు.మక్తల్ పట్టణంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఆలయాల అభివృద్ధి ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందన్నారు.పడమటి ఆంజనేయ స్వామి ఆలయానికి నూతన రాజగోపుర నిర్మాణం చేపట్టడం ద్వారా ఆలయ ప్రాశస్త్యాన్ని మరింత పెంపొందించడంతో పాటు, పట్టణ ఆధ్యాత్మిక గుర్తింపును బలోపేతం చేసే దిశగా ముందడుగు పడిందని మంత్రి తెలియజేశారు.ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు భక్తులకు మెరుగైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందించడంతో పాటు, మక్తల్ పట్టణ సాంస్కృతిక వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు దోహదపడ నున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ ఛైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జైన్ మందిర్ వద్ద కాలువ పూడికతీత పనులు ..

### పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి...



మక్తల్ :మక్తల్ నియోజకవర్గం క్రిష్ణ మండలం కున్ని –హిందుపూర్ సమీపంలోని జైన్ మందిర్ వద్ద ఆనంపల్లి, కొత్తపల్లి వైపు వ్యవసాయ పంట పొలాలకు సాగునీరు అందించే కాలువలలో పూడికతీత పనులను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు వారి సోదరుడు వాకిటి శేషగిరి పరిశీలించారు. ఈసందర్భంగా వాకిటి శేషగిరి మాట్లాడుతూ..క్రిష్ణ మండలం కున్ని వద్ద జైన్ మందిర్ నుంచి ఆనంపల్లి, కొత్తపల్లి వైపు సాగునీరు అందించే కాలువలలో పూడికతీత పనులను ప్రారంభించామని అన్నారు. నియోజకవర్గంలో దాదాపుగా అన్ని మండలాల్లో కాలువల పూడికతీత పనులు ఒక యజ్ఞంలా కొనసాగుతున్నాయని, గతంలో పూడికతీత లేక కాలువలు నిర్జీవంగా మారాయని, తిరిగి కాలువలకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జీవం పోస్తున్నారని అన్నారు. మంత్రి స్వయంగా రైతు అని, రైతుల కష్టాలపై ఆయనకు పూర్తిగా అవగాహన ఉందని, క్రిష్ణ, భీమా నదులపై కొత్తగా రిజర్వాయర్ ల నిర్మాణం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల స్థాయిలో ఇటీవల చర్చలు జరిపిన సంగతి గుర్తు చేశారు. రైతులపై మంత్రి కి ఉన్న ప్రత్యేక నిబద్దత ఇందుకు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, సీనియర్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పృథ్వీ బిగ్ మార్ట్ ను ప్రారంభించిన..

### – టిఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ళ రంజిత్ కుమార్



గద్వాల: పట్టణంలోని బసవన్న చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పృథ్వీ బిగ్ మార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ళ రంజిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నూతనంగా వ్యాపారాన్ని ప్రారంభించిన పృథ్వీ బిగ్ మార్ట్ యజమాని బాలు మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.గద్వాల పట్టణంలో నూతన వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం స్థానికంగా వ్యాపార కార్యకలాపాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు మీసాల కిష్టన్న, విష్ణు, గోపాల్,కార్తీక్,ప్రేమ్ రాజు, రంగస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## కరువు మండలాలను ప్రకటించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

### వివిధ రిజర్వాయర్ల పరిధిలో పంటలు చేతికొచ్చేదాకా సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలి





హైదరాబాద్ : ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో తీవ్రంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయి రాష్ట్రవ్యాప్తంగా వేసిన పంటలు తీవ్రమైన ఎండలు తీవ్రం కావడంతో ఎండిపోతున్నాయి.కరువు వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఈరోజు రైతు సంఘాల నాయకులు కలిసి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఎల్ నినో వల్ల రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల కింద వేసిన పంటలు ఎండిపోకుండా సాగు నీటిని విడుదల చేసీ కాపాడాలనీ,జూరాల ఆయకట్టుకు నీటి ఎద్దడి వల్ల ప్రభుత్వం వారబంది ప్రకటించింది దాని ప్రకారం పంటలు చేతికొచ్చేదాకా సకాలంలో సాగునీరును అందించాలనీ వ్యవసాయ శాఖ మంత్రి తో ఓవరాల్ గా రైతు సంఘాల నాయకులు చెప్పడం జరిగింది. మంత్రిగారూ స్పందించి వేసిన పంటను కాపాడుతామని హామీ ఇవ్వడం జరిగింది. కరువు వల్ల రైతులు వేసిన పంటలు ఎండిపోవడంతో వరికి ఎకరాకు 30 వేలు మిరప, పత్తికి 50వేలు కూరగాయలు, ఇతర పంటలకు 20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి కి రైతు సంఘాల నాయకులు వినతిపత్రం అందజేసిన తర్వాత సెక్రటేరేట్ మీడియా సెంటర్లో విలేకరుల సమావేశంలో మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, AIUKS రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాము, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి శోభన్, AIKMS నాయకులు విజయ్ లు కలిసి మంత్రి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## అయిజలో కాంగ్రెస్‌కు ఏడుగురు కౌన్సిలర్ల రాజీనామా?

### మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవిపై నిరసనగా నిర్ణయం?

అయిజ: జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సమాచారం. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి బీఆర్ఎస్ నాయకులకు వత్తాసు పలుకుతున్నారనే అసంతృప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు రాజీనామా లేఖలు పంపినట్లు తెలుస్తోంది. అయితే రాజీనామాలపై అధికారిక ధ్రువీకరణ, పార్టీ నాయకత్వం స్పందన తెలియాల్సి ఉంది.



# భూ రీసర్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి





## వెంకటాపూర్‌లో సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట, (సమయం ప్రతినిధి): జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక రెవెన్యూ, సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మరికల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ప్రత్యేక సర్వే బృందాలు నిర్వహిస్తున్న భూ రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిని సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన శిక్షణ పొందిన సర్వే బృందాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకొని పనులు వేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్లకు సూచించారు. రీసర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తోందని తెలిపారు. అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీసర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియతో భూ సరిహద్దుల నిర్ధారణతో పాటు రెవెన్యూ రికార్డుల్లో పారదర్శకత పెరుగుతుందని, భవిష్యత్తులో భూ వివాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. వెంకటాపూర్ గ్రామంలో 640 ఎకరాల భూమి ఉండగా, నిర్దేశిత ప్రాతిపదికన రీసర్వే నిర్వహించి 108 మందికి ఫారం-11 జారీ చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఎక్లాస్పూర్ గ్రామంలో 24 మందికి సంబంధించిన రీసర్వే ప్రక్రియ కూడా చేపట్టినట్లు తెలిపారు. సర్వే బృందాల్లో ప్రస్తుతం 24 మంది గొలుసు కొలతల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నిర్దేశించిన పనులన్నింటినీ రాబోయే 20 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ రీసర్వేను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే సిబ్బందికి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ రామ్‌కోటి, రెవెన్యూ, సర్వే శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# జనగణన-2027కు సర్వం సిద్ధం.. సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

## సమగ్ర సమాచారమే దేశాభివృద్ధికి పునాది: అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్






మహబూబాబాద్ జిల్లా :అక్టోబర్ 14 (వేకువ సమయం ప్రతినిధి): దేశాభివృద్ధికి సమగ్ర సమాచారం ఎంతో కీలకమని, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలకు జనగణన పునాదిగా నిలుస్తుందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి కె. అనిల్ కుమార్ అన్నారు. జనగణన-2027 రెండో దశ నిర్వహణకు అవసరమైన సన్నాహక పనుల్లో భాగంగా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా కలెక్టర్, జిల్లా ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు అక్టోబర్ 13, 14 తేదీల్లో మహబూబాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సెన్సస్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు జనగణన నిర్వహణకు సంబంధించిన విధివిధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

**స్వీయ గణనపై ప్రత్యేక శిక్షణ:** జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లను శిక్షణలో వివరించారు. జనగణన ప్రశ్నావళిలోని 1 నుంచి 40 వరకు ఉన్న ప్రశ్నలతో పాటు స్వీయ గణన ప్రక్రియపై సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ అందించారు. విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాచార సేకరణలో పాటించాల్సిన పద్ధతులపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ మాట్లాడుతూ, జనగణన దేశాభివృద్ధికి అవసరమైన కీలక సమాచారాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. జనగణన-2027 ప్రక్రియను క్రమబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించి, సమాచార సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని కోరారు.

**శిక్షణలో పాల్గొన్న అధికారులు**

ఈ కార్యక్రమంలో జిల్లా సెన్సెస్ అధికారి, సీపీఓ వల్లూరి శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి ఆడెపు వినయ్, ఎస్ఐ గ్రేడ్-II గుగులోత్ రాజు శిక్షకులుగా పాల్గొన్నారు. సెన్సస్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు, మండలాల ఎన్యుమరేటర్లు పాల్గొని శిక్షణ పొందారు.జనగణన-2027 విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి, తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అధికారులు సూచించారు.

# గద్వాల పట్టణంలో విస్తృత వాహన తనిఖీలు



గద్వాల : గద్వాల పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానాస్పద కార్యకలాపాల కట్టడితో పాటు రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని అందించడం, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ట్రాఫిక్ నిబంధనల అమలును పటిష్టం చేయడంలో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.గద్వాల పట్టణంలోని ఫ్లైఓవర్ “ఎ” జంక్షన్ వద్ద పట్టణ ఎస్సై శ్రీనివాస్, సీఐ టంగుటూరి శ్రీను ఆధ్వర్యంలో, మేలచెరువు చౌరస్తా వద్ద రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులను గుర్తించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు కూడా నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టారు.జిల్లా ఎస్పీ లిటి. శ్రీనివాసరావు, లి, తనిఖీలు నిర్వహిస్తున్న ప్రాంతాలను సందర్శించి పోలీసు అధికారులకు పలు కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిశితంగా పరిశీసూచనలు చేశారు. నేరాల నియంత్రణలో భాగంగా ప్రధాన రహదారులు, రద్దీ కూడళ్లు, కీలక ప్రాంతాల్లో నిరంతరం నిఘా లించాలని సూచించారు. వాహన తనిఖీలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రాధాన్యం: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తుందని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అవసరమైన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, పోలీసుల తనిఖీలకు సహకరించాలని కోరారు. ప్రజల భద్రత కోసం చేపట్టే ఇటువంటి తనిఖీలకు ప్రతి ఒక్కరూ సహకరించి, ప్రమాదరహిత ప్రయాణానికి బాధ్యత వహించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.

# సూక్ష్మ సేద్య పరికరాల కోసం మూడేళ్లుగా రైతుల ఎదురుచూపులు!

**5 వేల మందికిపైగా దరఖాస్తులు.. పంపిణీపై స్పష్టత ఏదీ?**
**ఇతర జిల్లాల్లో పంపిణీ.. మహబూబాబాద్‌లో జాప్యమెందుకు?**
**పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించాలని రైతుల విజ్ఞప్తి**

మహబూబాబాద్ జిల్లా: అక్టోబర్ 14 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లాలో సూక్ష్మ సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు మూడేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది రైతులు నమోదు చేసుకున్నప్పటికీ, పరికరాల పంపిణీ ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఆరోపిస్తున్నారు. ఇతర జిల్లాల్లో సూక్ష్మ సేద్య పరికరాలు పంపిణీ చేస్తున్నారని, మహబూబాబాద్ జిల్లాలో మాత్రం ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు.

**వేలాది దరఖాస్తులు.. పంపిణీ ఏదీ?**

జిల్లాలో వివిధ పంటలు సాగు చేస్తున్న 5 వేల మందికిపైగా రైతులు సూక్ష్మ సేద్య పరికరాల కోసం నమోదు చేసుకున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే, తమకు తెలిసినంతవరకు కనీసం ఐదుగురికైనా పరికరాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించిన అధికారులు వాటి పరిశీలన, అర్హుల ఎంపిక, పరికరాల మంజూరు, పంపిణీ ప్రక్రియను ఎంతవరకు పూర్తి చేశారో స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. మూడేళ్లుగా ఎదురుచూస్తున్నా తమ సమస్యకు పరిష్కారం లభించడం లేదని వాపోతున్నారు.

**నిధుల వినియోగంపై అనుమానాలు**

సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీకి కేటాయించిన నిధులను సకాలంలో వినియోగించకపోవడంతో అవి వెనక్కి వెళ్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. జిల్లాకు ఎంతమేర నిధులు కేటాయించారు? ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు? ఎంతమంది రైతులకు పరికరాలు అందించారు? ఇంకా ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? అనే వివరాలను ఉద్యాన శాఖ బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**నీటి పొదుపునకు సూక్ష్మ సేద్యం కీలకం**

మిర్చి, కూరగాయలు, పసుపు, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడానికి బిందు, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులు ఉపయోగపడతాయని చెబుతున్నారు. సకాలంలో పరికరాలు అందితే సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు నీటిని సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే, పంపిణీలో జాప్యం కారణంగా ప్రభుత్వ పథకం ద్వారా లభించాల్సిన ప్రయోజనాలను పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి.**

జిల్లా కలెక్టర్ ఈ అంశంపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీలో జాప్యానికి గల కారణాలను గుర్తించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన రైతులకు నిర్ణీత గడువులో పరికరాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిధుల కేటాయింపు, వినియోగం, పరికరాల పంపిణీకి సంబంధించిన వివరాలను అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల ఆరోపణలపై విచారణ జరిపి, జాప్యానికి బాధ్యులైన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# స్త్రీనిధి రుణాల వసూళ్లు, పంపిణీలో పురోగతి సాధించాలి
# వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి






**నారాయణపేట, (సమయం ప్రతినిధి):** స్త్రీనిధి రుణాల వసూళ్లు, రుణాల పంపిణీతో పాటు స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. వెనుకబడిన మండలాలు, తక్కువ పనితీరు కనబరుస్తున్న సిబ్బందిపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి పెంచాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్త్రీనిధి రుణ సహకార సమాఖ్య జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో రుణాల వసూళ్లలో ప్రస్తుత పురోగతి సంతృప్తికరంగా ఉన్నప్పటికీ మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ వసూళ్లు నమోదవుతున్న మండలాలు, సంఘాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ప్రతి వారం మండలాల వారీగా పురోగతిని సమీక్షించాలని, ప్రతి నెలా కమ్యూనిటీ సమన్వయకర్తల పనితీరును అంచనా వేయాలని ఆదేశించారు. పని తీరు మెరుగుపరచుకోని సిబ్బందిపై సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రాబోయే మూడు నెలల్లో రుణాల వసూళ్లను గణనీయంగా పెంచాలని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నెలవారీ, వార్షిక రుణ పంపిణీ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. దసరాలోపు రుణాల పంపిణీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడంతో పాటు సంబంధిత వివరాల నమోదును ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి మంజూరైన ప్రతిపాదనలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే నిర్మాణ పనులను దసరా తర్వాత ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గుర్తించి గ్రామపంచాయతీ తీర్మానాలతో ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. స్థలాల గుర్తింపు, అనుమతులు, నిర్మాణ పనుల ప్రారంభంలో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, వచ్చే మార్చి నాటికి అన్ని గ్రామపంచాయతీల్లో మహిళా సంఘాల భవనాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గిడ్డంగులు, భవనాలు, ప్రాసెసింగ్ కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, రాబోయే ఒకటి నుంచి రెండు నెలల్లో పనుల్లో గణనీయమైన పురోగతి కనిపించాలని ఆదేశించారు. నెల రోజుల తర్వాత మండలాల వారీగా పనితీరును మరోసారి సమీక్షిస్తామని, అప్పటిలోగా వెనుకబడిన మండలాలు, సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వెంకట్ రాములు, ఎల్‌డీఎం సురేష్ ఆత్రేయ, మున్సిపల్ కమిషనర్ శంకర్, జిల్లా మహిళా సమాఖ్య సభ్యురాలు, స్త్రీనిధి సిబ్బంది, ఏపీఎంలు, సీసీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంగంపల్లి దళితులని అవమానించిన అగ్రవర్ణాలను వెంటనే అరెస్టు చేయాలి



వనపర్తి : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామానికి చెందిన ఎమ్మెల్యే మేగారెడ్డి సొంత గ్రామమైన మంగంపల్లి గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ఉన్న దళిత యువకుడు సుధీర్ తన బిడ్డ తన భార్యతో కలిసి దేవాలయ ప్రవేశానికి పోతే ఎమ్మెల్యే మేనమామ రాంరెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి తదితరులు మీరు దళితులు కనుక దేవాలయాలోనికి పోవడానికి వీల్లేదు అని దౌర్జన్యంగా దాడి చేయవలసి వస్తుందని హెచ్చరించారు. బెదిరించారు. రాజ్యాంగం ప్రకారం ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన మేఘ రెడ్డి గ్రామంలో దళితుల గృహప్రవేశం లేకపోవడం సిగ్గుచేటు ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఎమ్మెల్యే మెగారెడ్డి స్వయంగా దళితుల ఇండ్లకు పోయి ప్రజలందరినీ పిలుచుకొని దేవాలయ ప్రవేశం చేయించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా దళితుడైన సుధీర్ని దేవాలయంలోనికి పోవడానికి వీలులేదని ఇక్కడనుంచి వెళ్లిపోవాలని బెదిరించారు హెచ్చరించారు. సుధీర్ ని బెదిరించిన వారిని దౌర్జన్యానికి పాల్పడ్డ వాళ్ళని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం. ఇలాంటి గ్రామంలో దళితులకి ఏలాంటి అవమానాలు జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం ఎస్పీ, జిల్లా కలెక్టర్ చోరవ తీసుకొని దళితులకు ఇలాంటి అవమానాలు జరగకుండా చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. లేనియెడల మంగంపల్లి దళితుల పక్షాన ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వ్యాప్తంగా పోరాటాలు చేయవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు. సుధీర్ కుటుంబాన్ని అవమానపరిచిన అగ్రవర్ణాలని వెంటనే కేసులు పెట్టి శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ నర్వ మండలం యాంకి గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ (ఎం-ఎల్)మాస్ లైన్ జిల్లా నాయకులు పి.అరుణ్ కుమార్, యాంకి అంబేద్కర్ యువజన సంఘం నాయకులు లిజె.రాము,పట్నం పెద్ద శ్రీను,కర్రెకురుమన్న, సిలిగండ్ల లినాగన్న,జె.ఆనంద్, బైని కురుమన్న,జె. శేఖర్,టి.నరేష్, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల టౌన్ నూతన ఎస్ఐగా ఎం. శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



గద్వాల: గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా ఎం. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖతో సహకరించాలని కోరారు.

## భవానీ అమ్మవారి సేవలో పన్నాల బుచ్చిరెడ్డి కుటుంబం
## శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో అన్నదానం





కీసర సమయం ప్రతినిధి, అక్టోబర్ 14: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసరలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కీసరలోని శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ భవానీ అమ్మవారి మండపంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సింగిల్ విండో వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి సేవలో భాగస్వాములవుతూ భక్తులకు అన్నదానం చేయడం ఆధ్యాత్మిక తృప్తినిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.పండుగ వేళ ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు భక్తిభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని అభిప్రాయపడ్డారు. భవానీ అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భక్తులు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్తా, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మచ్చాని జంగయ్య యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నైపుణ్య శిక్షణ ప్రాక్టికల్ పరీక్షలు



మహబూబ్ నగర్ : నిరుద్యోగ మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు మహిళా అభ్యర్థులకు నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా ముగిశాయి. గౌరవ ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళా అభ్యర్థులకు ఈ పరీక్షలను నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంతో పాటు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని మెప్మా కార్యాలయంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ మహిళా అభ్యర్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలపై అభ్యర్థులకున్న అవగాహన, పనితీరు, ఆచరణాత్మక నైపుణ్యాలను అంచనా వేసే ఉద్దేశంతో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించారు. అభ్యర్థులు తమకు అందించిన శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను పరీక్షల్లో ప్రదర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇన్‌చార్జి నిజలింగప్ప పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అభ్యర్థులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో ఎలా ఉపయోగిస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే సంప్రదాయ విద్యతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలు కూడా ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో నిరుద్యోగ మహిళలకు వివిధ కోర్సుల్లో శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించేలా ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నైపుణ్య శిక్షణ ద్వారా మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రావీణ్యం సంపాదించి, ఉద్యోగ అవకాశాలను పొందడంతో పాటు సొంతంగా ఉపాధి కార్యకలాపాలను ప్రారంభించేందుకు కూడా అవకాశం ఉంటుంది. తద్వారా కుటుంబ ఆదాయానికి తోడ్పడటంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి, వారి నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలచడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయి. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం అనేది కేవలం ఒక కోర్సును నేర్పించడమే కాకుండా, వారి భవిష్యత్తుకు ఉపాధి మార్గాలను సృష్టించే ప్రక్రియగా భావించవచ్చు. సరైన శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం, నిరంతర ప్రోత్సాహం లభిస్తే మహిళలు వివిధ రంగాల్లో రాణించగలుగుతారు. ఈ దిశగా నిరుద్యోగ మహిళలకు అవకాశాలు కల్పించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి సహకారంతో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు, ఆర్థికంగా బలోపేతం కావడానికి దోహదపడతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు.

# మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ వేగవంతం చేయాలి






నారాయణపేట, (సమయం ప్రతినిధి): మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి తహసీల్దార్లతో భూసేకరణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించి రైతులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వారితో చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రతిపాదనలు, పరిహారం చెల్లింపులు, సర్వే నంబర్లకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట రైతులతో నేరుగా చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములు, ఆక్రమణలు లేని భూములు, వాటి స్థితిగతులు, సర్వే వివరాలతో తహసీల్దార్లు సిద్ధంగా ఉండాలని తెలిపారు. భూసేకరణకు అనువైన భూములను గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించే అవకాశం ఉన్నందున భూములకు సంబంధించిన రికార్డులు, వివరాలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. రేడియల్ రోడ్డు భూసేకరణ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, క్షేత్రస్థాయిలో సంబంధిత బృందాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రహదారి పనులకు ఆటంకాలు కలగకుండా పెండింగ్ సమస్యలను పరిష్కరించి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అవార్డులు, పరిహారం చెల్లింపులు, సర్వే అంశాలను సమీక్షించి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. భూసేకరణ పనుల పురోగతిపై వచ్చే వారం మరోసారి సమీక్ష నిర్వహిస్తామని, అప్పటిలోగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవో రమేష్, ఏవో అనిల్ కుమార్, భూసర్వే ఏడీ వేణుగోపాల్ రెడ్డి, నారాయణపేట, ఉట్కూర్, దామరగిద్ద, మద్దూరు, గుండుమల్, కోస్గి మండలాల తహసీల్దార్లు అమరేంద్ర కృష్ణ, అశోక్ కుమార్, తిరుపతయ్య, మహేష్, భాస్కర స్వామి, కళ్యాణి, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీ

### పేదల సంక్షేమం, దేశ భద్రతకు ఆయన నిరంతర కృషి: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భండారి శాంతికుమార్




మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం దేశ చరిత్రలో ప్రత్యేకమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భండారి శాంతికుమార్ అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా సుపరిపాలనకు బాటలు వేసి, ప్రధానిగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మోదీ ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. దేశంలోని నిరుపేదలకు ఉచిత రేషన్ బియ్యం అందించడం, జనధన్ ఖాతాల ద్వారా సంక్షేమ పథకాల నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం ద్వారా అవినీతిని అరికట్టేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. దేశ భద్రత విషయంలో మోదీ తీసుకున్న నిర్ణయాలు కీలకమని, జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ఉగ్రవాదంపై కఠిన చర్యలు దేశ ప్రయోజనాలకు దోహదపడ్డాయని అన్నారు. కరోనా సంక్షోభ సమయంలో స్వదేశీ పరిజ్ఞానంతో టీకాల తయారీకి ప్రోత్సాహమిచ్చి, దేశ ప్రజలకు టీకాలు అందించడంతో పాటు ఇతర దేశాలకు కూడా సహాయం చేయడం ద్వారా భారత్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ, ఎన్డీఏ అభ్యర్థులకు ప్రజల మద్దతు లభించిందని, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. దేశభక్తి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మోదీ నాయకత్వంలో భారత్ మరింత సురక్షితంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు పడకుల బాలరాజు, సుదర్శన్ రెడ్డి, నంబి రాజు, అంజయ్య, ఎగ్గని నరసింహులు సాగర్, కొండ బుచ్చారెడ్డి, వీరబ్రహ్మాచారి, ప్రతాప్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, గూడెం నారాయణ, రామ్‌రెడ్డి, కౌకుంట్ల అంజనేయులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## టోల్ బాదుడు..! సౌకర్యాల మాటకొస్తే..నిర్లక్ష్యం పోకడలు!

హైదరాబాద్: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్).. నగరానికి మణిహారంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ప్రతిష్టాత్మక ఎక్స్‌ప్రెస్‌వే. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తూ.. నగర శివార్లను అనుసంధానిస్తూ నిత్యం వేలాది వాహనాలకు వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తోంది. అయితే.. వాహనదారుల నుంచి భారీగా టోల్ వసూలు చేస్తున్నప్పటికీ.. అదే స్థాయిలో భద్రత, నిర్వహణ, మౌలిక వసతులు అందుతున్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

**టోల్ వసూళ్లలో దూకుడు.. వసతుల్లో వెనుకడుగు..!**

ఓఆర్ఆర్ పై ప్రయాణించే ప్రతి వాహనం నుంచి టోల్ రూపంలో రుసుము వసూలు చేస్తున్నారు. కానీ.. వాహనదారులకు అవసరమైన సౌకర్యాలు, రహదారి నిర్వహణ, లైటింగ్, అత్యవసర స్పందన వంటి అంశాల్లో మరింత మెరుగుదల అవసరమని ప్రయాణికులు చెబుతున్నారు. భారీ మొత్తంలో టోల్ చెల్లిస్తున్నప్పుడు.. సురక్షితమైన, ఇబ్బందుల్లేని ప్రయాణం తమ హక్కు అని వాహనదారులు పేర్కొంటున్నారు.

**చీకట్లో జాతీయ స్థాయి రహదారి.. ప్రమాదాలకు ఆహ్వానమా?**

రాత్రి వేళల్లో కొన్ని ప్రాంతాలు, జంక్షన్ల వద్ద స్ట్రీట్ లైట్లు సరిగా వెలగకపోవడం వాహనదారులను ఆందోళనకు గురిచేస్తోంది. అధిక వేగంతో వాహనాలు ప్రయాణించే ORRపై తగినంత వెలుతురు లేకపోవడం ప్రమాదాల తీవ్రతను పెంచే అవకాశం ఉందని వాహనదారులు అంటున్నారు. పనిచేయని లైట్లను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టే పటిష్టమైన నిర్వహణ వ్యవస్థ ఉండాలని కోరుతున్నారు.

**ఫాస్టాగ్ పనిచేయక.. టోల్ గేట్ల వద్ద పడిగాపులు!**

టోల్ ప్లాజాల వద్ద FASTag సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు వాహనాలు నిలిచిపోతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఫాస్టాగ్ పనిచేయని సందర్భాల్లో ప్రత్యామ్నాయ మార్గాలు వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. టెక్నాలజీ ఆధారిత టోల్ వ్యవస్థలో అంతరాయం ఏర్పడితే.. దాని ప్రభావం నేరుగా వాహనదారులపై పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది

**ఓవర్‌లోడ్ వాహనాలపై నిఘా ఏది?..**

ఔటర్ రింగ్ రోడ్డు పై నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో ప్రయాణించే భారీ వాహనాలపై మరింత కఠినమైన నిఘా అవసరమని వాహనదారులు చెబుతున్నారు. ఓవర్‌లోడ్ వాహనాల వల్ల బ్రేకింగ్ సామర్థ్యం, వాహన నియంత్రణ వంటి అంశాల్లో ప్రమాదాలు పెరిగే అవకాశం ఉండటంతో.. టోల్ ఎంట్రీల వద్దే నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రమాదం జరిగితే.. స్పందన ఎంత వేగంగా?**

ఓఆర్ఆర్ పై ప్రమాదం జరిగిన సమయంలో అత్యవసర సేవలు ఎంత వేగంగా స్పందిస్తున్నాయి? అంబులెన్స్, పెట్రోలింగ్ వాహనాలు, క్రేన్‌లు, ఇతర సహాయక బృందాలు ఎంత సమయంలో సంఘటనా స్థలానికి చేరుకుంటున్నాయి? అనే అంశాలపై కూడా పర్యవేక్షణ అవసరమని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదాలను ముందుగానే నివారించే విధంగా భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరుతున్నారు.

**టోల్ తీసుకుంటే.. సౌకర్యాలు ఇవ్వాలి!**

టోల్ చెల్లిస్తున్న వాహనదారులకు సురక్షితమైన ప్రయాణం, మెరుగైన రహదారి నిర్వహణ, తగిన లైటింగ్, సమర్థవంతమైన టోల్ వ్యవస్థ, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఓఆర్ఆర్ ప్రతిష్టను దృష్టిలో ఉంచుకుని నిర్వహణలో ఎక్కడా రాజీ పడకుండా అధికారులు, సంబంధిత నిర్వహణ సంస్థలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. టోల్ వసూళ్లు పెరుగుతున్న కొద్దీ.. సౌకర్యాల స్థాయి కూడా పెరగాలి.. బిలేకపోతే.. "టోల్ బాదుడు.. బాదుడే.. సౌకర్యాలు మాత్రం చీకటే!" అన్న విమర్శలు మరింత బలపడే అవకాశం ఉంది.

## ఎస్‌బీ 459 మొక్కజొన్న విత్తనాలతో అధిక దిగుబడులు

### తక్కువ వర్షపాత పరిస్థితుల్లోనూ మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం: ఎల్ఎస్ఆర్ సీడ్స్ ప్రతినిధులు




(సమయం ప్రతినిధి): ఎల్ఎస్ఆర్ సీడ్స్ సంస్థకు చెందిన ఎస్‌బీ 459 మొక్కజొన్న విత్తనాలు వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ రైతులకు మెరుగైన దిగుబడులు అందించగలవని ఆ సంస్థ రీజినల్ బ్రాంచ్ మేనేజర్ వి. రమణారెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామంలో రైతు శంకర్ పొలంలో సాగు చేస్తున్న ఎస్‌బీ 459 మొక్కజొన్న పంటను పరిశీలిస్తూ బుధవారం రైతు క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ఈ వంగడం తక్కువ వర్షపాతం పరిస్థితుల్లోనూ పంట దిగుబడికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ రకం మొక్కజొన్న తక్కువ పంటకాలంలోనే చేతికి వచ్చే అవకాశం ఉండటంతో పాటు, కొన్ని రకాల పురుగులను తట్టుకునే లక్షణాలు కలిగి ఉందని తెలిపారు. దీంతో రైతులకు క్రిమిసంహారక మందుల ఖర్చులు తగ్గే అవకాశం ఉందన్నారు. అలాగే మొక్కజొన్న కంకుల వలుచుట సులభంగా ఉండటం వల్ల కూలీల ఖర్చులు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు.త్వరగా పంట చేతికి రావడం వల్ల తదుపరి పంట సాగుకు అవకాశం కలుగుతుందని వివరించారు. రైతులు తమ ప్రాంతంలోని వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, సాగునీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని తగిన విత్తన రకాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీ మంజునాథ ట్రేడర్స్‌కు చెందిన వి. కుమార్ గౌడ్, కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ రాజశేఖర్ గౌడ్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## హరీష్ రావును కలిసిన తెలంగాణ ఉద్యమ నేత



మక్తల్ : నారాయణ పేట జిల్లా మఖ్తల్ నియోజకవర్గ నర్వ మండల తెలంగాణ మలిదశ ఉద్యమ కారులు సీనియర్ తెలంగాణ ఉద్యమ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికడుతూ పార్టీ అధినేత కెసిఆర్ పిలుపుమేరకు పార్టీ రాబోయే రోజుల్లో ఏ కార్యా చరణ చేపట్టెందుకు తెలంగాణ ఉద్యమకారులు సంసిద్ధంగా ఉండాలని హరీష్ రావు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఉద్యమకారులకు మంచి భవిష్యత్తు ఉండబోతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఉద్యమకారులు ఎప్పుడు పార్టీకి అండగా ఉండాలని తెలంగాణ ఉద్యమకారుడు దేవర మల్లప్ప తెలిపారు.

# పేదల పక్షాన పోరాడిన ప్రజానాయకుడు పండుగ సాయన్న: మంత్రి వాకిటి శ్రీహరి

## నవాబుపేటలో పండుగ సాయన్న కాంస్య విగ్రహం ఆవిష్కరణ.. ఈ నెల 22న రవీంద్రభారతిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న ఆశయాలను భావితరాలకు అందించాలని రాష్ట్ర క్రీడలు, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. పండుగ సాయన్న ఒక కులానికే పరిమితమైన నాయకుడు కాదని, సామాజిక అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజానాయకుడని పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో పండుగ సాయన్న కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం పాలనలో ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి భయపడే పరిస్థితుల్లోనూ పండుగ సాయన్న ధైర్యంగా దోపిడీ దొరలు, దేశ్‌ముఖ్‌లను ఎదిరించి, వారు దోచుకున్న సంపదను పేదలకు పంచి అండగా నిలిచారని తెలిపారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్దార్ పాపన్న, కొమురం భీమ్ వంటి పోరాట యోధులు సైతం సామాజిక అన్యాయాలు, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. మహనీయులను కులాలకు పరిమితం చేయకుండా, వారి ఆశయాలను అన్ని వర్గాల ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పాలమూరు గడ్డపై నవాబుపేట మండలం మెరుగోనిపల్లెలో జన్మించిన పండుగ సాయన్న తెలంగాణ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన సేవలు, త్యాగాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో నవాబుపేటలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో పండుగ సాయన్న తొలి కాంస్య విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించడం ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రకటించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలుగా నిర్వహించేందుకు తాను ప్రతిపాదనలు పంపగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు రోజుల్లోనే ఆమోదం తెలిపారని వెల్లడించారు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత ఆయన స్ఫూర్తితో సామాజిక అన్యాయాలను ధైర్యంగా ఎదిరిస్తూ పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. విగ్రహాల ఏర్పాటు మాత్రమే కాకుండా మహనీయుల ఆలోచనలు, త్యాగాలను ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని, విద్య ద్వారా ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి సమాజంలో తగిన గుర్తింపు సాధించాలని సూచించారు. కులాభిమానం ఇతర వర్గాల పట్ల వివక్షకు దారితీయకూడదని, అన్ని కులాల ప్రజలు పరస్పర సహకారంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ముదిరాజ్‌లను బీసీ-బీ నుంచి బీసీ-ఏలో చేర్చే అంశంపై తన వంతు కృషి చేస్తానని, ఇప్పటికే బీసీ-ఏలో ఉన్న మత్స్యకార వర్గాలకు నష్టం కలగకుండా ముదిరాజ్‌లకు సముచిత రిజర్వేషన్ ప్రయోజనాలు లభించేలా ప్రయత్నిస్తానని తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి మరింత మంది ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలుగా ఎదిగేందుకు సహకరిస్తానన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సహా అన్ని బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి పండుగ సాయన్న స్ఫూర్తితో పనిచేస్తానని పేర్కొన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ నవాబుపేటలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్ మండలాల్లోనూ పండుగ సాయన్న విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు నవాబుపేట మండలానికి చేరుకున్న మంత్రి వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌లకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్, మహబూబ్‌నగర్ నగర మేయర్ జి. మమత, నవాబుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మాజీ ఎంపీ శ్రీనివాస్ రెడ్డి, నవాబుపేట మండల ప్రజాప్రతినిధులు, ముదిరాజ్, మత్స్యకార సంఘాల నాయకులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ & బీజేపీలకు భారీ షాక్.. కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక



దేవరకద్ర : దేవరకద్ర మండలం గురకొండ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై దేవరకద్ర ఎమ్మెల్యే G. మధుసూదన్ రెడ్డి (GMR) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే GMR వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

## ముదిరాజులను బీసీ-ఏ గ్రూపులో చేర్చాలి



(సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్) : మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన బహుజన వీరుడు, తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న విగ్రహాన్ని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎర్ర శేఖర్, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..... పండుగ సాయన్న పేద ప్రజల కోసం తపించిన బహుజన వీరుడని, ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. సమైక్య పాలనలో పండుగ సాయన్నతో పాటు దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వంటి మహనీయుల చరిత్రను కనుమరుగు చేశారని, తెలంగాణ ఉద్యమం తర్వాతే వారి పోరాట స్ఫూర్తి, చరిత్ర ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాయని అన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముదిరాజులకు ఎంపీగా, యాదవులకు, ఎంబీసీలకు ఎమ్మెల్సీలుగా అవకాశాలు కల్పించామని గుర్తుచేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులను బీసీ-ఏ గ్రూపులో చేర్చాలని, కేసీఆర్ గారు ఇచ్చిన మాదిరిగా ముదిరాజులకు ఉచితంగా చేప పిల్లలు, మోపెడ్లు అందించాలన్నారు. నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతో పాటు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అవకాశాల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం జనగణనలో ప్రతి కుటుంబానికి కోడ్ కేటాయించి బీసీ కులగణన చేపట్టి ప్రతి కులానికి న్యాయం చేయాలని అన్నారు. బీసీ, బహుజన వర్గాలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ అవకాశాలు, రిజర్వేషన్లు కల్పించినప్పుడే అన్ని వర్గాల్లో రాజకీయ చైతన్యం పెరిగి రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు.

## జగన్మాత.. చల్లగా చూడు తల్లి..!

### శరన్నవరాత్రి వేళ.. అమ్మవారి సన్నిధిలో భక్తి పారవశ్యం..! ఏబీ విల్లాస్, టీచర్స్ కాలనీలో ఘనంగా దేవి నవరాత్రి వేడుకలు.. శ్రీ భవానీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన కౌన్సిలర్ డి. రాజు నాయక్..

షాద్‌నగర్, అక్టోబర్ 14: షాద్‌నగర్ పట్టణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి వేడుకల సందర్భంగా పట్టణంలోని ఆలయాలు ప్రత్యేక అలంకరణలతో కళకళలాడుతుండగా.. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అమ్మవారి నామస్మరణ, భక్తిగీతాలతో పలు ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.పట్టణం 6వ వార్డు పరిధిలోని ఏబీ విల్లాస్, టీచర్స్ కాలనీ ప్రాంతాల్లోని శ్రీ భవానీ మాత ను నెలకొల్పిన పలుచోట్లా శరన్నవరాత్రి వేడుకలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహిస్తూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**అమ్మవారి సన్నిధిలో కౌన్సిలర్ రాజు నాయక్..**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ వార్డు కౌన్సిలర్ డి. రాజు నాయక్ ఏబీ విల్లాస్, టీచర్స్ కాలనీలలోని శ్రీ భవానీ మాతను దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, వార్డు ప్రజల క్షేమం కోసం ప్రార్థించారు.ఈ సందర్భంగా శ్రీ మాత వేడుకల నిర్వాహకులు, స్థానిక కాలనీవాసులు కౌన్సిలర్ రాజు నాయక్‌ను ఆహ్వానించారు. నవరాత్రి వేడుకల నిర్వహణ, భక్తులకు అందుతున్న సౌకర్యాల గురించి స్థానికులతో మాట్లాడి అన్ని వేళలా అందుబాటులో ఉండి సహకారం అందిస్తామన్నారు.

**జగన్మాత.. చల్లగా చూడు తల్లి..**

అమ్మవారి సన్నిధిలో కౌన్సిలర్ రాజు నాయక్ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. "జగన్మాత.. చల్లగా చూడు తల్లి.. అమ్మ భవానీ.. దీవించు తల్లి.." అంటూ అమ్మవారిని ప్రార్థించారు. ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కౌన్సిలర్ రాజు నాయక్ ఆకాంక్షించారు. ప్రజల కుటుంబాల్లో శాంతి, సౌభాగ్యం, సంతోషం నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించారు. అలాగే షాద్‌నగర్ పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణం ఉండాలని అమ్మవారి ఆశీస్సులు కోరారు.

**అమ్మవారి దర్శనం కోసం భక్తులు..**

భక్తులతో కిటకిటలాడిన నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఏబీ విల్లాస్, టీచర్స్ కాలనీల్లోని ఆలయాలకు భక్తుల రాక పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు, యువత, వృద్ధులు, చిన్నారులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు.

ప్రత్యేకంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. పూలతో ఆలయాలను అలంకరించి.. దీపాలు వెలిగిస్తూ.. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తున్నారు.

**అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక శోభ..**

నవరాత్రి వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాలు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో ఆకట్టుకుంటున్నాయి. అమ్మవారి నామస్మరణ, భక్తిగీతాలు, హారతులతో పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటున్నారు.

**6వ వార్డ్ లో...పండుగ సందడి.**

దసరా నవరాత్రి వేడుకలతో ఏబీ విల్లాస్, టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది. ప్రతి రోజు వివిధ కార్యక్రమాలతో భక్తులు అమ్మవారిని కొలుస్తున్నారు. కాలనీవాసులు కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకుని అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు.అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడుతున్నాయి.

**భక్తి.. విశ్వాసం.. అమ్మవారి ఆశీస్సుల కోసం వేడుకలు..**

శరన్నవరాత్రులు కేవలం పూజలకే పరిమితం కాకుండా.. ప్రజలను భక్తి, ఆధ్యాత్మికత వైపు నడిపించే పర్వదినాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు.. సమాజంలో సుఖశాంతులు నెలకొనాలని భక్తులు కోరుకుంటున్నారు. ఈ క్రమంలో 6వ వార్డులోని ఏబీ విల్లాస్, టీచర్స్ కాలనీల్లో జరుగుతున్న నవరాత్రి వేడుకలు స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.జగన్మాత కృపతో.. ప్రతి ఇంటా ఆనందం.. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు.. ప్రతి అడుగులో విజయాలు కలగాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# గద్వాల నియోజకవర్గంలో మాజీమంత్రి హరీష్ రావు విస్తృతంగా పర్యటన







గద్వాల : బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాసు హనుమంత నాయుడు ఆధ్వర్యంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు,మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి,మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తో కలిసి,మాజీ మంత్రి హరీష్ రావు విస్తృతంగా పర్యటించారు.... ఈ మేరకు గట్టు మండలం ఇందువాసి గ్రామంలో కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లాలో కూలి పనుల కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు వలస కూలీల కుటుంబాలను క్షతగాత్రులను పరామర్శించి,ఆర్థిక సహాయం అందజేశారు.... అదే విధంగా,గట్టు మండలం బల్గెర గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని, కార్యకర్తలకు ఉత్సాహాన్ని నింపారు....అనంతరం,గట్టు మండల కేంద్రంలో సబ్ స్టేషన్ లగ్ బుక్ ను పరిశీలించి, ఓల్టేజ్ పై కరెంటు సమస్యల పైన విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు... రాయపురం గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి,రైతు సమస్యలను అడిగి తెలుసుకొని, సర్వేనెంబర్ 83 రైతులను కలిసి,మీకు న్యాయం జరిగే వరకూ బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు...... ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, BRS పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

- ఇందువాసి వలస కూలీలు కుటుంబాలను పరామర్శించి ఎండిన పంట పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి
- తన్నీరు హరీష్ రావు, ● సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు
- మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్

## టిఎంజెఎఫ్ అధ్యక్షుడిగా వంగూరి జయశంకర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్న జిల్లా నూతన కమిటీ



నాగర్‌కర్నూల్, సమయం ప్రతినిధి అక్టోబర్ 14: తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం (TMJF) నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కమిటీ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నాగర్‌కర్నూల్ పట్టణంలోని దేవకి ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా TMJF రాష్ట్ర అధ్యక్షులు నరేందర్ గారు హాజరై, జిల్లా నూతన అధ్యక్షుడిగా వంగూరి జయశంకర్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్, జిల్లా, మండల స్థాయి రిపోర్టర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీ వివరాలు:
- జిల్లా అధ్యక్షుడు: వంగూరి జయశంకర్
- ఉపాధ్యక్షులు: సౌటా రాము, ఎర్రవల్లి శ్రీనివాసులు
- ప్రధాన కార్యదర్శి: బి. రామస్వామి
- కోశాధికారి: కావలి పరశురాములు
- ఆర్గనైజింగ్ సెక్రెటరీలు: గిద్ద విజయ్ కుమార్, సి. సుందర్
- ప్రచార కార్యదర్శి: యాదయ్య

ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు వంగూరి జయశంకర్ మాట్లాడుతూ.. "నాపై నమ్మకం ఉంచి నన్ను అధ్యక్షుడిగా ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షులు నరేందర్ గారికి, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ గారికి కృతజ్ఞతలు. జిల్లాలోని ప్రతి రిపోర్టర్ కు అండగా, దండగా నిలబడతా. జాతి బాబు కోసం, జాతి అభివృద్ధి కోసం మా కలాన్ని విని యోగిస్తాం. త్వరలోనే పూర్తి స్థాయి కమిటీని నియమిస్తాం" అని తెలిపారు.

## గోవా కేంద్రంగా తెలంగాణలో సాగుతున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదించిన హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 14: తెలంగాణలో మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌పై తెలంగాణ ఈగల్ టీం ఉక్కుపాదం మోపింది. గోవా కేంద్రంగా తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న డ్రగ్స్ దందా గుట్టురట్టు చేసింది. గోవా పోలీసుల సహాయంతో.. ఈగల్ ఫోర్స్, హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి ముగ్గురు డ్రగ్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు ప్రీతీశ్ నారాయణ్ బోర్కర్ అలియాస్ బాబు అలియాస్ ఖలీని అక్టోబర్ 12న గోవాలో అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## నీతులు చెప్పే ముందు గత పాలనను గుర్తు తెచ్చుకోవాలి డిప్యూటీ మేయర్ మారెపల్లి సురేందర్ రెడ్డి

మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ నీతులు చెప్పే ముందు గత పదేళ్ల పాలనలో నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో గుర్తు తెచ్చుకోవాలని మహబూబ్‌నగర్ నగర డిప్యూటీ మేయర్ మారెపల్లి సురేందర్ రెడ్డి విమర్శించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, రాజకీయ ఒత్తిళ్లు, భయాందోళనలను విస్మరించి ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. శ్రీనివాస్ గౌడ్ మళ్లీ అధికారంలోకి వస్తానని కలలు కంటున్నారని, మరోసారి ఎన్నికల్లో గెలుస్తాననుకోవడం భ్రమేనని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, అధికారం కోల్పోయిన తర్వాత ప్రజాస్వామ్యం, న్యాయం, నీతి గురించి మాట్లాడటం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో ప్రజలు ఎదుర్కొన్న పరిణామాలపై సమాధానం చెప్పిన తర్వాతే ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శించాలని సూచించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎవరు ప్రజల పక్షాన నిలిచారో, ఎవరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవహరించారో వారికి తెలుసని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ప్రజా ప్రభుత్వంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యమిస్తూ, ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి పట్టణంలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం,



విద్యారంగాన్ని బలోపేతం చేయడం, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ అభివృద్ధి పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చకు రావాలని మాజీ మంత్రికి సూచించారు. గతంలో ఏం జరిగింది, ప్రస్తుతం ఏం జరుగుతోంది, భవిష్యత్తులో మహబూబ్‌నగర్‌ను ఎలా అభివృద్ధి చేయాలనే అంశాలపై నిర్మాణాత్మక చర్చ జరగాలని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలతో ప్రయోజనం లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ భర్త గుమ్మాల్ శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నాయకులు సంతన్న యాదవ్, గోవర్ధన్ గౌడ్, సీజే బెనహర్, గిరిధర్ గౌడ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## జంతర్ మంతర్ ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం ప్రజాస్వామిక విలువలపై దాడి చేయడమే

ఖమ్మం : ఓటు చోర్ జ్ఞానేశ్వర్ ను సీఈసీ నుండి తొలగించేంతవరకు ప్రగతి శీల శక్తులు, ప్రజాస్వామ్యవాదులు ఉద్యమాలను కొనసాగించాలని పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర కార్యదర్శి అనిల్ అన్నారు. ఈరోజు ఖమ్మం పట్టణం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పిడిఎస్యు రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల, పౌరుల ప్రాథమిక హక్కు అయిన ఓటింగ్ హక్కును చోరీ చేసి, 13 కోట్ల మంది ఓటు హక్కును హరించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ ను తొలగించాలని జంతర్ మంతర్‌లో జెన్ జీ విద్యార్థి, యువత ఇచ్చిన ఉద్యమ పిలుపు మోడీ ప్రభుత్వం అడ్డుకొని దుర్మార్గంగా వ్యవహరించిందని అన్నారు.




మోడీ ప్రభుత్వం వందలాది రైళ్లు రద్దు చేసి, మెట్రో స్టేషన్‌లను మూసి వేయడం, వేలాది మంది పోలీసులను మోహరించడం చేసిందన్నారు.




భాషతో సంబంధం లేకుండా హిట్ కోసం చాలా కష్టపడుతోంది మహానటి కీర్తి సురేష్. ఈమధ్యనే కోలీవుడ్ లో డోరతీ సినిమాతో విమర్శకుల ప్రశంసలను అందుకున్న కీర్తి ఎక్కువగా లేడీ ఓరియెంటెడ్ సినిమాల వైపు మొగ్గు చూపుతోంది. ఇప్పటికే నెట్ ఫ్లిక్స్ లో అక్కా అనే బోల్డ్ సిరీస్ చేస్తోన్న ఆమె తాజాగా నటించిన మరో లేడీ ఓరియెంటెడ్ సినిమా సత్యవాన్ సావిత్రి. ప్రవీణ్ ఎస్ విజయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో డైరెక్టర్ మిస్కిన్ కీలక పాత్రలో నటించాడు. ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన పోస్టర్స్ రిలీజ్ మంచి హైప్ ని క్రియేట్ చేశాయి. తాజాగా సత్యవాన్ సావిత్రి టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఇప్పటికే వాశి సినిమాలో లాయర్ గా మెప్పించిన కీర్తి.. మరోసారి సత్యవాన్ సావిత్రిలో లాయర్ గా కనిపించింది. కథ విషయానికొస్తే.. సావిత్రికి చిన్నప్పటి నుంచి లాయర్ కావాలని కోరిక. ఆ ఆశయంతోనే ఇంట్లో ఒప్పుకోకపోయినా లా చదివి కోర్టులో వచ్చీరాని వాదన చేస్తూ జడ్జిలకు కోపం తెప్పిస్తూ ఉంటుంది. ఇక ఎప్పటికైనా తనకు ఇన్స్పిరేషన్ అయిన మార్కండేయతో వాదించాలని సావిత్రి చాలా ప్రయత్నాలు చేస్తుంది. చివరికి సావిత్రి కల నెరవేరిందా.. ? మధ్యలో భర్తతో సమస్య ఏంటి.. ? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.




భారతీయ చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటోన్న విజువల్ వండర్ 'రామాయణ'. నితీష్ తివారీ దర్శకత్వంలోరూపుదిద్దుకుంటున్న ఈ దృశ్య కావ్యంపై ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార చిత్రాలు నెట్టింట సెన్సేషన్ క్రియేట్ చేయగా.. తాజాగా ఈ చిత్ర బృందం మరో భారీ ధమాకాకు రంగం సిద్ధం చేసింది. కర్ణాటక రాజధాని బెంగళూరు వేదికగా 'రామాయణ' ట్రైలర్-2 ను గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు టీమ్ ప్రకటించింది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన అతిపెద్ద హైలైట్ ఏమిటంటే.. వెండితెరపై రాముడు, రావణులుగా ఎదురుపడబోయే ఇద్దరు పాన్-ఇండియా సూపర్ స్టార్లు ఒకే వేదికను పంచుకోనుండటమే! బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ (శ్రీరాముడు), కన్నడ గడ్డ ముద్దుబిడ్డ 'రాకింగ్ స్టార్' యశ్ (రావణుడు) ఇద్దరూ కలిసి ఈ గ్రాండ్ లాంచ్ వేడుకలో పాల్గొనన్నారు. సొంతగడ్డపై యశ్ అడుగుపెడు తుండటంతో కన్నడ నాట అభిమానుల సందడి తారాస్థాయికి చేరింది. యశ్ ఎంట్రీ అంటేనే ఒక వైబ్రేషన్.. దానికి తోడు రణ్‌బీర్ కపూర్ క్రేజ్ కూడా తోడవడంతో బెంగ ళూరు నగరం ఈ చారిత్రాత్మక సినిమాటిక్ సెలబ్రేషన్‌ను అంగరంగవైభవంగా సిద్ధమైంది. బెంగళూరు వేదికగా జరగనున్న ఈ మహా వేడుక కోసం మేకర్స్ అత్యంత భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రైలర్-1 తోనే అంచనాలను పెంచేసిన చిత్ర బృందం.. ఈ రెండో ట్రైలర్‌లో రాముడు-రావణుల మధ్య సాగే పౌరాణిక ఘట్టాలు, విజువల్ ఎఫెక్ట్స్, భారీ యుద్ధ సన్నివేశాలను మరింత క్లారిటీగా చూపించ బోతున్నట్లు తెలుస్తోంది. నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఆస్కార్ విన్నింగ్ సంస్థ DNEG, యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తు న్న ఈ భారీ చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదలకానుంది. గురువారం (అక్టోబర్ 15) విడుదల కానున్న ఈ రెండో ట్రైలర్ ఇంకెన్ని రికార్డులను తిరగ రాస్తుందో చూడాలి!




టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చాలా గ్యాప్ తరువాత నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ప్యాక్డ్ మూవీ హైందవ. లూధీర్ బైరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, స్పెషల్ గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా భారీ అంచనాలను పెంచేశాయి. తాజాగా ఈ సినిమా టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. దేవుళ్లు, నమ్మకాలు, ఆచారాలు, విగ్రహాల అదృశ్యం వంటి పవర్ టెల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ టీజర్ కట్ ఆకట్టుకుంటోంది. రంగాపురం అనే గ్రామంలో దేవుని విగ్రహాలు మాయమవుతాయి. దాంతోపాటూ సడెన్ గా మనుషులు హత్యకు గురవుతారు. ఇదంతా దేవుని ఆగ్రహం అని ప్రజలు భయపడుతుంటారు. ఇక ఈ కేసులను చేధించడానికి దేవుడంటే నమ్మకం లేని పోలీస్ గా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కనిపించాడు. ఆ ఊర్లో విగ్రహాలను కొట్టేసింది ఎవరు.. ? ఆ విగ్రహాలలో ఏముంది.. ? పుష్కర సమయానికి గుడిలో విగ్రహాలు ఎలా వస్తాయి.. ? అనేది సినిమా చూసి తెల్సుకోవాల్సిందే.

# Cinema




మలయాళ దర్శకుడు షామ్‌దత్, యంగ్ హీరో ఇంద్ర రామ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'డోంట్ స్లీప్'. మమ్ముట్టి నటించిన మలయాళం, తమిళ ద్విభాషా థ్రిల్లర్ 'స్ట్రీట్ లైట్స్'తో దర్శకుడిగా పరిచయమైన సినిమాటోగ్రాఫర్ షామ్‌దత్, ఈ చిత్రంతో తెలుగులో దర్శకుడిగా అడుగుపెడుతున్నారు. 'చౌర్య పాఠం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఇంద్ర రామ్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. వీ డ్రీమ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై వీ చుడామణి నిర్మిస్తున్న రెండో సినిమా ఇది. గురువారం నాగచైతన్య, విజయ్ సేతుపతి, దుల్కర్ సల్మాన్ కలిసి ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. పెళ్లి తర్వాత సంతోషంగా, ప్రశాంతంగా జీవిస్తున్న కథానాయకుడి జీవితంలోకి ఓ కల రూపంలో అనూహ్యమైన పరిణామం చోటు చేసుకుంటుంది. అతను కన్న కలల్లో ఒకటి నిజం కావడం మొదలైనప్పటి నుంచి అతని జీవితం తలకిందులవుతుంది. అతన్ని చంపాలని ప్రయత్నిస్తున్న ఓ మిస్టరీ వ్యక్తి నిరంతరం వెంటాడుతుంటాడు. ప్రాణాలు ప్రమాదంలో పడటంతో అప్రమత్తంగా ఉంటూ, తనను తాను కాపాడుకోవడానికి కథానాయకుడు పోరాడాల్సి వస్తుంది. ఇంతకుముందెన్నడూ చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు షామ్‌దత్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టే కథనం, ఆకట్టుకునే వాయిస్ ఓవర్, ప్రత్యేకమైన విజువల్ ట్రీట్‌మెంట్ టీజర్‌ను మరింత ఆసక్తికరంగా మార్చాయి. సినిమాటోగ్రాఫర్‌గా కూడా షామ్‌దత్ తన ప్రతిభను చాటుకున్నారు. అద్భుతమైన విజువల్స్‌తో సినిమా మూడ్‌ను, ఉత్కంఠను మరింత పెంచారు. గోకుల్ హర్షన్ అందించిన నేపథ్య సంగీతం సన్నివేశాల్లోని ఉత్కంఠను పెంచి ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేస్తోంది. 'పుష్ప: ది రైజ్', 'రంగస్థలం' చిత్రాలకు పనిచేసిన మోనికా -రామకృష్ణ ఈ సినిమా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్టేట్ అవార్డు గ్రహీత మనోజ్ ఎడిటింగ్ చేస్తున్నారు. దుల్కర్ సల్మాన్ నటించిన 'ఐ యామ్ గేమ్' చిత్రానికి పనిచేసిన సజీర్ బాబా, లూనా ఈ కథను అందించారు. ఇంద్ర రామ్ సహజమైన నటనతో ఆకట్టుకున్నారు. విలన్ పాత్రలో రవీంద్ర విజయ్ బలమైన ముద్ర వేశారు. ముఖ్యంగా చివరి సన్నివేశంలో ఆయన నటనలోని వైవిధ్యం కనిపిస్తోంది. తబా రీమా, జోయితా బెనర్జీ, సునీల్ థాపా, ఆడుకలం నరేన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విభిన్నమైన కథాంశం, విజువల్స్, ఉత్కంఠభరితమైన కథనంతో 'డోంట్ స్లీప్' టీజర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో ఇంద్రరామ్ మాట్లాడుతూ, 'షామ్ గారు కథ చెప్పినప్పుడు నాకు చాలా కొత్తగా అనిపించింది. ఇద్దరం కలిసి కేరళ వెళ్లి లొకేషన్స్ రెక్కీ చేశాం. 15 రోజుల్లో షూటింగ్ మొదలుపెట్టాం. డీఓపీనే డైరెక్టర్ అవడం వల్ల తనకు అనుకున్నట్టుగా చేయగలిగారు. చాలా మంచి ప్రొడక్షన్ వాల్యూస్ ఉన్న సినిమా ఇది. శ్యామ్ గారితో నాకు చాలా ఎమోషనల్ జర్నీ. ఆయన కేవలం డైరెక్టర్ మాత్రమే కాకుండా అన్ని విభాగాల్లో కేర్ తీసుకున్నారు. సినిమా చాలా బాగా వచ్చింది.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085